పెన్ పవర్
తెలంగాణ రౌండప్



బహుదూర్‌పల్లిలో 90 గజాల్లో ఈ భారీ నిర్మాణాన్ని మార్చి 13న సీజ్ చేసిన శ్రీకాంత్ నిర్మాణం..

# సీజ్ చేసినా..! కూల్చేసినా కట్టుకోవడం 'కామన్..!

- అక్రమార్కుల బరితెగింపు..! అధికారుల ఉదాసీనత..!
- దుండిగల్ టౌన్‌ప్లానింగ్‌లో అధికారులు మారినా..!అక్రమ నిర్మాణాలు మామూలే ..

అక్రమ కట్టడాలపై టౌన్‌ప్లానింగ్ అధికారుల చర్యలు అంటేనే..! సెటిల్మెంట్‌ల కోసం చేపట్టే 'తూతూమంత్రపు' కూల్చివేతలుగా సంబంధిత అధికారులే పరోక్షంగా నిర్ధారిస్తున్నారు.. నిబంధనలు ఉల్లంఘించినవి కూడా ముడుపులు ముట్టగానే సక్రమం అయిపోతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఆతర్వాత అదనపు అంతస్తులు, అక్రమ సెల్లార్‌లు, జీరో సెట్‌బ్యాకులు ఇవేమి అధికారులకు తప్పుగా అనిపించడం లేదని స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు..! అదే దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల ప్రత్యేకత అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు.. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదన్న వాదనలు ఉన్నాయి.. సాధారణంగానే కొందరు అక్రమార్జనే ధ్యేయంగా, ఇలాంటి చోటకు, తమ పలుకుబడితోనో..! పైఅధికారుల వద్ద ప్రాధేయపడో..! తృణమో- ప్రణమో సమర్పించుకునో..! మొత్తానికి లాభదాయకమైన పోస్టింగులకు సిఫార్సులు చేయించుకుంటారని గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఇంత పకడ్బందీగా, అధికారులు ఆలోచనా పరమైన విధులు నిర్వర్తిస్తుంటే..! చట్టాల అమలు సాధ్యమేనా..?అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాల పట్ల దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ అధికారుల ఉదాసీనతపై 'పెన్ పవర్' ప్రత్యేక కథనం.. దుండిగల్, పెన్ పవర్, మే 27:

- దుండిగల్ సర్కిల్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారుల నియంతృత్వ ధోరణి..?
- అక్కడ చర్యలంటే సెటిల్మెంట్‌ల కోసమేనా..? అంటూ విమర్శల వెల్లువ..?
- ఈమాత్రం దానికో కార్యాలయం, అందులో అధికారుల హంగామా అంటూ విమర్శలు..?
- ఏ రేంజ్‌లో చర్యలు చేపట్టినా..! అక్రమం అక్రమమే..!నిర్మాణంలో మార్పులు శూన్యం.
- చివరికి ముడుపులు ముట్టగానే..! నేతల సిఫార్సులు అంటూ బుకాయింపు..?




- బహుదూర్‌పల్లిలో సిద్దార్థ-శ్రీకాంత్ అక్రమ నిర్మాణాలు సీజ్‌చేశారు,నోటీసులిచ్చారు..!
- అయినా పనులు ఎలా పూర్తి చేశారు..?1500 గజాల అక్రమ షెడ్లూ అదేతీరు..!
- టెక్ మహీంద్రా ఎదురుగా కూల్చేసిన 48 గంటల్లో మళ్ళీ నిర్మాణం పూర్తి..
- అదనపు 3 అంతస్తులు అదేవిధంగా ఉన్నాయి.. స్టిల్ట్ ఆక్రమణ అట్లనే ఉన్నది..
- గండిమైసమ్మలో తాజా హోటల్ పక్కన చర్యలు చేపట్టినా..! నిర్మాణం పూర్తి..!
- దుండిగల్ సర్కిల్ సిఎంసి వ్యాప్తంగా..! నోటీసులు-చర్యలు-సెటిల్మెంట్‌లు..?

-4లో



బహుదూర్‌పల్లిలో మార్చి 13న నోటీసులు ఇచ్చిన, సిద్దార్థ అక్రమ నిర్మాణం..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## డ్రైనేజీ సమస్యకు.. పరిష్కారం చూపండి..

### ఫారెస్ట్ అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే.. తాత్కాలిక పరిష్కారం..



- దయానంద నగర్, రాజుల స్వామి నగర్‌లో నాలా సమస్య.. ఫారెస్ట్‌లో జామ్..
- పరిసర బస్తీ వాసుల ఫిర్యాదుతో ఫారెస్ట్ అధికారుల పరిశీలన..
- సూరారం ఆర్‌జికె నుండి పారుతున్న నాలా జామై ఉప్పొంగిన డ్రైనేజీ..
- నాలానీరు ఫారెస్ట్ వైపు మళ్లించేందుకు ప్రతిపాదన..
- సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారుల హామీ..

-5లో

- మిగతా 4లో...





## ఆందోళన వద్దు.. వారం రోజుల్లో వడ్ల కొనుగోళ్లు పూర్తి

హైదరాబాద్ పెన్ పవర్: వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని రాబోయే వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. స్థానిక వ్యవసాయ సముదాయ గిడ్డంగి గోదాముల్లో స్థలం సరిపోకపోతే.. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలోని కొన్ని ప్రైవేట్ గోదాములను లీజుకు తీసుకున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది రానివ్వమని భరోసా ఇచ్చారు.

# సీజ్‌చేసినా..! కూల్చేసినా..! కట్టుకోవడం 'కామన్'..!




టెక్ మహీంద్రా ఎదురుగా.. పర్మిషన్ 2 అంతస్తులు, అక్రమంగా 3 అంతస్తులు, మొత్తం 5 అంతస్తులు..




బహుదూర్‌పల్లిలో 1500 గజాల అక్రమ షెడ్డును కూల్చిన తర్వాత ఇలా నిర్మాణం..



కూల్చిన 24 గంటల్లోమళ్ళీ నిర్మాణం..



1500 గజాల అక్రమ షెడ్డు మార్చి 26న కూల్చివేత నాటి ఫొటో..

- 3 పేజి తరువాయి

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ, అక్రమ నిర్మాణాలలో మార్పులు ఉండకపోవడం గమనార్హం.. 'సీజ్‌చేసినా..! కూల్చేసినా..! కట్టుకోవడం మాత్రం 'కామన్' పాయింట్‌గా గమనించాలని పరోక్షంగా నిర్ధారిస్తున్న అంశం..? అన్న ఆరోపణలకు బలం చేకూరుతుంది.. "నోటీసులు-సీజింగ్‌లు-కూల్చివేతలు" కేవలం పత్రికా కథనాలకు, ప్రశ్నించే వారిని మభ్యపెట్టే ఆయుధాలు అంటూ కొందరు వ్యంగ్యారోపణలు చేస్తున్నారు.. అసలు టౌన్‌ప్లానింగ్ అధికారుల దృష్టిలో చర్యలంటే, పై మూడు అంశాలే కీలకమని భావిస్తున్నారు కాబోలు..! స్పీకింగ్ ఆర్డర్ వరకే చర్యల ప్రస్తావనకు ముగింపు పలికి, ఆతర్వాత 'కహానీలు' చెప్పడం ప్రారంభిస్తారని, అక్రమ నిర్మాణాల్లో ఏమాత్రం మార్పులు ఉండవని విమర్శలు వినిపిస్తున్నాయి.. నిర్మాణ చట్టాలను సంపూర్ణంగా అమలు చేయడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు కూడా లేకపోలేదు.. మరోవైపు అక్రమ నిర్మాణాలకు నష్టం వాటిల్లకుండా "సీజింగ్‌లు-స్పీకింగ్ ఆర్డర్‌ల" జారీతో చర్యల కథ సుఖాంతం చేయడమే టౌన్‌ప్లానింగ్ నూతన విధివిధానాలు అంటూ, పలువురు వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు.. ఓవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన "టిజి-బిపాస్, బిల్డ్‌నవ్" చట్టాలను, నాడు "జీహెచ్ఎంసి-నేడు సిఎంసి" వ్యవస్థలు, అత్యంత సులభంగా నిర్వీర్యం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. దీంతో దుండిగల్ సర్కిల్-59 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ చూసినా పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి..




తాజా హోటల్ పక్కన అక్రమ నిర్మాణం సీజ్ చేశారు, కూల్చేశారు..

మార్చి 26న సంబంధిత అక్రమ నిర్మాణం కూల్చిన నటి ఫొటో..






సీజ్ చేసిన టౌన్‌ప్లానింగ్ టీమ్ ఫొటోషూట్ చిత్రం..

## చర్యలకు వెళ్ళితే..! ఫోన్‌లు వస్తున్నాయట..!

గండిమైసమ్మ నుండి ఓఆర్ఆర్‌కి వెళ్ళేదారిలో తాజా హోటల్ పక్కన అక్రమ నిర్మాణాన్ని జనవరి 28న నోటీసులు, మార్చి 26న కూల్చివేతలు, మార్చి 30న కూల్చినవి మళ్ళీ నిర్మించాడు.. సంబంధిత అక్రమ నిర్మాణంపై ఇప్పుడు చర్యలు తీసుకోవాలంటేనే అధికారులు వణికి పోతున్నారట..? అక్రమ సెల్లార్, అదనపు అంతస్తులు, సెట్‌బ్యాకులు జీరో, స్టిల్ట్‌లో (పార్కింగ్) కమర్షియల్ షట్టర్‌లు.. వెరసి ఈ అక్రమ భవన నిర్మాణం నర్సాపూర్ హైవే 200 ఫీట్ల రోడ్డు ఎఫెక్ట్‌లోనూ ఉన్నట్టు సమాచారం..? ఇలాంటి తప్పుడు నిర్మాణాన్ని కూల్చివేసిన వెంటనే నిర్మించడానికి ఓ అధికారపార్టీ నాయకుడు అండగా ఉన్నట్టు అనధికారిక సమాచారం.. ఇప్పటికీ చర్యలకు వెళ్ళిన సిబ్బందికి నిర్మాణ దారుడు ఫోన్ చేసి ఆ నాయకునితో మాట్లాడిస్తున్నట్టు బోగట్టా..

## చర్యలంటేే అర్ధం..? మళ్ళీ కట్టుకోమని సంకేతమా..?

దుండిగల్ సర్కిల్‌లో గతంలోనూ, అక్రమ నిర్మాణాలపై ఓ 'టిపిఎస్' విధులు కూడా, ఇంతకంటే రెట్టింపు నిర్లక్ష్యమే ఉండేది.. ప్రభుత్వ పెద్దల పలుకుబడి కూడా ఉందనే ఆరోపణలు ఉన్నాయి.. అలాంటి అధికారి "ఏసిబి" దాడులతో డామిట్ కథ అడ్డం తరిగింది.. ప్రస్తుతం ఆస్థాయిలోనే అక్రమ కట్టడాలకు సహకరించడం మళ్ళీ మొదలైంది. బహుదూర్‌పల్లిలో టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చేసిన 1500 గజాల అక్రమ షెడ్డును, మళ్ళీ నిర్మించారు.. పత్రికల్లో వచ్చినా నిర్లక్ష్యం వహిస్తున్నారే కాని చర్యల ఊసేలేదు.. టెక్ మహీంద్రా ఎదురుగా రెండు అంతస్తుల పర్మిషన్‌తో, అదనంగా మూడు అంతస్తులు నిర్మించి మొత్తానికి ఓ "ఐదంతస్తుల" భవనం సిద్ధం చేశాడు.. ఫిర్యాదుల పోరు పడలేక అన్నట్టు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఓరోజు కూల్చివేతల డ్రామాను రక్తికట్టించారు.. సంబంధిత అక్రమ నిర్మాణ దారుడు, కక్కుర్తికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నాడు.. 24 గంటలు గడవక ముందే నిర్మాణ పనులు సజావుగా సాగటం, అధికారులతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగమై ఉండవచ్చని పలువురు ఆరోపిస్తున్నారు..

## బహుదూర్‌పల్లిలో 'బలే' తమాషా చర్యలు..

దుండిగల్ సర్కిల్ సిఎంసి టౌన్‌ప్లానింగ్ చర్యలు "పిల్లి కళ్ళు మసుకుని పాలు త్రాగిన" చందంగా 'బలే తమాషా'గా ఉంటాయని, పలువురు ఎద్దేవా చేస్తున్నారు.. బహుదూర్‌పల్లి విలేజ్ పరిధిలో నాలుగు అక్రమ కట్టడాలకు అధికారులు ఏవిధంగా సహకరిస్తున్నారో కళ్ళకు కట్టినట్టు పాఠకుల కోసం ప్రయత్నం చేద్దాం..! బిల్డర్ శ్రీకాంత్ అక్రమ నిర్మాణాన్ని గత మార్చి 13న దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు దర్జాగా సీజ్ చేశారు.. అదేరోజు బహుదూర్‌పల్లిలోనే బిల్డర్ సిద్దార్థ అక్రమ కట్టడానికి నోటీసులు ఇచ్చామని స్థానిక చైన్‌మెన్ చెబుతున్నదే..! ఈ చర్యల ప్రక్రియ తోపాటు, వెంటనే పనులు కూడా నిలిపివేయాలని, గతేడాది '2025 మే 2న' ఓకేసు తీర్పు సందర్భంగా, అక్రమ నిర్మాణాల వ్యవహారంలో జీహెచ్ఎంసికి తెలంగాణ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీచేసింది.. హైకోర్టు ఆదేశానుసారం, జీహెచ్ఎంసి కమిషనర్ "ఆర్.వి కర్ణన్ జారీ చేసిన సర్క్యులర్ నెంబర్:375296 TPS-HO- GHMC 2025/732 ప్రకారం.. చర్యలు ప్రారంభించగానే పనులు కూడా నిలిపివేయాలని స్పష్టంగా కనిపిస్తుంది.. చర్యలు చేపట్టి దాదాపు "రెండున్నర నెలలు" సమయంలో ఈ రెండు నిర్మాణాలు, హైకోర్టు ఆదేశాలు సైతం ఉల్లంఘించి, పరదాల చాటున పనులు ముగించడం అధికారులకు తెలియకుండా సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి..

# ఆందోళన వద్దు.. వారం రోజుల్లో వడ్ల కొనుగోళ్లు పూర్తి: మంత్రి వివేక్ వెంకట స్వామి

-3 పేజి తరువాయి

గత బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ధాన్యం కొనుగోళ్లు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి వివేక్ వెల్లడించారు. జూన్ 15వ తేదీ వరకు కొనుగోలు చేయాల్సిన మొత్తాన్ని.. ఈరోజు అంటే మే 27 నాటికే లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రికార్డు సృష్టించామన్నారు. ఈసారి 15 రోజుల ముందే పంట చేతికి రావడం, దిగుబడి కూడా భారీగా పెరగడంతో.. హమాలీలు, లారీల కొరత వల్ల అక్కడక్కడా కొనుగోళ్లు కొంత ఆలస్యమైన మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు.అయితే లారీల కొరత రాకుండా ఉండేందుకు మంచిర్యాల, భూపాలపల్లి ౧+వీణజ× ఉన్నతాధికారులతో ఇప్పటికే మాట్లాడామని.. కొనుగోలు కేంద్రాల వద్దకు మరిన్ని లారీలను తరలిస్తున్నామని చెప్పారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సమీక్షిస్తూ.. ధాన్యానికి త్వరితగతిన గోదాములకు తరలించేలా యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఇదే సమయంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను మంత్రి వివేక్ తీవ్రంగా ఖండించారు."సింగరేణి భవనాలను తగలబెట్టండి, రైలు పట్టాలను ధ్వంసం చేసి ఆందోళనలు చేపట్టండి" అంటూ బాల్క సుమన్ కార్యకర్తలను రెచ్చగొట్టడం అత్యంత దుర్మార్గం. వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద జరుగుతున్న ఆందోళనల్లో అసలు రైతులు ఎవరూ పాల్గొనడం ద లేదని స్వయంగా బాల్క సుమనే ఒప్పుకోవడం హాస్యాస్పదంగా ఉంది. దీన్నిబట్టి బీఆర్ఎస్ పార్టీపై, ఆ పార్టీ నేతలపై తెలంగాణ రైతులకు నమ్మకం పూర్తిగా పోయిందని అర్థమవుతోంది అని మంత్రి ఎద్దేవా చేశారు.





దయానంద్ నగర్‌లో నాలా జామైన ప్రాంతంలో పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, వారాల వినోద్.

# డ్రైనేజీ సమస్యకు.. పరిష్కారం చూపండి

వారాల వినోద్ కుమార్.. ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ నేత..

## ఫారెస్ట్ అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే.. తాత్కాలిక పరిష్కారం..

- దయానంద నగర్, రాజుల స్వామి నగర్‌లో నాలా సమస్య.. ఫారెస్ట్‌లో జామ్..
- పరిసర బస్తీ వాసుల ఫిర్యాదుతో ఫారెస్ట్ అధికారుల పరిశీలన..
- సూరారం ఆర్‌జికే నుండి పారుతున్న నాలా జామై ఉప్పొంగిన డ్రైనేజీ..
- నాలానీరు ఫారెస్ట్ వైపు మళ్లించేందుకు ప్రతిపాదన..
- సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారుల హామీ..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మే 27:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 292వ డివిజన్ సాయిబాబా నగర్ పరిధిలోని దయానంద నగర్, రాజుల స్వామి నగర్ బస్తీలలో నెలకొన్న నాలా సమస్యపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.. ఈ సమస్యను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ నేత వారాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బస్తీ వాసులు ఎమ్మెల్యే కె.పి.వివేకానందను కలిశారు.. సూరారం కాలనీ రాజీవ్ గృహకల్ప, తెలుగుతల్లి నగర్, 60 గజాల్లోని పలు బస్తీల నుండి నిత్యం విడుదల అవుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నీరు దయానంద్ నగర్, రాజులస్వామి నగర్, వరకు ప్రవహించి, అక్కడ ఫారెస్ట్‌లోనికి వెళ్తుంది.. అయితే లోపల డ్రైనేజీ నీటికి అడ్డంకులు ఏర్పడి పూర్తిగా జామైందని, దీంతో డ్రైనేజీ వ్యవస్థ స్తంభించి, మొన్న రాత్రి కురిసిన వర్షానికి, కాలనీలో నాలా ఉప్పొంగిందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు.. ప్రస్తుతం ఫారెస్ట్ లోపల నాలా అడ్డంకులు తొలగిస్తేనే ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కారం దొరుతుందని, తమకు శాశ్వత పరిష్కారం చూపమని ఎమ్మెల్యే కె.పి.వివేకానందను స్థానిక ప్రజలు కోరారు..

### ఫారెస్ట్ అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే..

స్థానికుల సమస్యను వెంటనే పరిగణలోకి తీసుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద అటవీశాఖ అధికారులతో మాట్లాడారు.. నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఇబ్బందులు పడకుండా, తక్షణ చర్యలు చేపట్టేందుకు సహకరించాలని అన్నారు.. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారి ఎఫ్ఎస్‌వో ప్రవీణ్ కుమార్, సిబ్బంది, స్థానికులతో కలిసి, సమస్య ఏర్పడిన ప్రాంతాన్ని పరిశీలించారు.. నాలా నీరు ఫారెస్ట్ ప్రాంతాలకు సక్రమంగా వెళ్లే విధంగా అవసరమైన చర్యలపై చర్చించారు.. సంబంధిత శాఖల సమన్వయంతో త్వరలోనే నిర్ణయం తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు... ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజ్‌కుమార్, కావలి రవి కిషోర్, మహిళలు, బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యే స్పందనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు..



స్థానికులతో కలిసి అటవీశాఖ అధికారులు, వారాల వినోద్ కుమార్..

## కూకట్‌పల్లి డిపోలో 60 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బస్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి, జెండా ఊపి 60 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా ప్రజలకు పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసు కొస్తున్నామని తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంతో 2027 నాటికి మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 960 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, అందులో హైదరాబాద్ నగరంలోనే 545 ఈవీ బస్సులు సేవలందిస్తున్నాయని తెలిపారు. ఇంటర్‌సిటీ సేవల కింద 580 బస్సులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు .మొత్తం 3,000 ఎలక్ట్రిక్ బస్సులను అమలు చేస్తే 600 టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ మరో ఢిల్లీలా కాలుష్య నగరంగా మారకుండా ఉండేందుకే ఈవీ వాహనాలను ప్రోత్సహి స్తున్నామని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావం ప్రజా రవాణాపై ఎంత ఉందో అందరికీ తెలుసని అన్నారు. ఆర్టీసీలో ప్రస్తుతం 10 వేల బస్సులు ఉండగా, అందులో 1,000 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల ట్రాఫిక్‌తో పాటు కాలుష్యం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. జంట నగరాల్లో రోజుకు 35 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగి స్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో పలు సంస్కరణలు చేపట్టామని మంత్రి తెలిపారు. కొత్త నియామకాలు, కొత్త బస్సుల ప్రవేశంతో ఆర్టీసీ దేశంలోనే ఉత్తమ సంస్థగా నిలుస్తోందన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రతి నెల రెండో మంగళవారం డీఎంలు, ఆర్ఎంలు మరియు ఇతర



ఉన్నతాధికారులు కార్మికుల సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. త్వరలోనే ఆర్టీసీ సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించి, అనంతరం సంఘాల ప్రతినిధులతో సమావేశమై సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 310 కోట్ల టికెట్లను వినియోగించుకున్నారని మంత్రి వెల్లడించారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు మహిళలను బస్సుల యజమానులుగా కూడా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు కేపీహెచ్‌బీలో కొత్త డిపో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కూకట్‌పల్లి డిపో విస్తరణలో భాగంగా 5 ఎకరాల స్థలంలో కొత్త డిపో ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్, ఆర్టీసీ అధికారులు హౌసింగ్ బోర్డు అధికారులకు లేఖ రాయాలని సూచించారు. హైదరాబాద్‌లో కొత్త కాలనీలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థను కూడా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని, సంస్థ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఇకపై కూకట్‌పల్లి ప్రాంతాన్ని కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఈవీ బస్సులు రోడ్లపై విస్తృతంగా నడుస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు

## హైదరాబాద్ రోడ్లపైకి మరో 60 కొత్త ఓలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు

**హైదరాబాద్, మే 27: పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో పర్యావరణ హిత ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక అడుగు పడింది. నగరంలో సుస్థిర పట్టణ రవాణా అభివృద్ధికి కట్టుబడి ఉన్న టీజీఎస్ఆర్టీసీ (TGSRTC) 500 బస్సుల ప్రాజెక్టులో భాగంగా మరో 60 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు బుధవారం నగర రోడ్లపైకి రానున్నాయి. ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (EVEY Trans Pvt. Ltd.) , టీజీఎస్ఆర్టీసీ సంయుక్త భాగస్వామ్యంతో, ప్రతిష్టాత్మకమైన టీజీఎస్ఆర్టీసీ 500 బస్సుల ప్రాజెక్టులో భాగంగా ఓలెక్ట్రా తయారు చేసిన 12 మీటర్ల లో-ఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సులను కూకట్‌పల్లి డిపోలో బుధవారం రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ , టిజిఎస్ఆర్టీసీ విసి, ఎండీ నాగిరెడ్డి, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించనున్నారు. ఈ కొత్త బస్సుల చేరికతో టీజీఎస్ఆర్టీసీ 500 బస్సుల ప్రాజెక్టు విజయవంతమైంది. ఇది హైదరాబాద్ నగరంలో పర్యావరణ అనుకూల ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. టీజీఎస్ఆర్టీసీ 500 బస్సుల ప్రాజెక్టు కింద మొత్తం 450 నాన్-ఏసీ మరియు 50 ఏసీ లో-ఫ్లోర్ ఎలక్ట్రిక్ సిటీ బస్సులు హైదరాబాద్ నగర ప్రజా రవాణా సేవలను బలోపేతానికి ప్రవేశ పెడుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కింద కంటోన్మెంట్ (సీఎన్‌టీ), హెచ్ సీయూ , మియాపూర్, హయత్‌నగర్, రాణిగంజ్ డిపోల నుంచి 440 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా సేవలంది స్తున్నాయి. ఇప్పుడు కూకట్‌పల్లి డిపో నుంచి చివరి దశలో 60 బస్సులు చేరడంతో మొత్తం 500 ఎలక్ట్రిక్ బస్సులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. ఈ ఎలక్ట్రిక్ బస్సులకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సౌకర్యవంతమైన ప్రయాణం, విశ్వసనీయ సేవలు, పర్యావరణహిత లక్షణాల కారణంగా ప్రజలు వీటిని అధికంగా వినియోగించి ఆదరిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రోజుకు సుమారు ఒక లక్ష మంది ప్రయాణికులు ఈ ఎలక్ట్రిక్ బస్సులను ఉపయోగిస్తున్నారు. కొత్తగా 60 బస్సులు చేరడంతో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 1.2 లక్షలకు పెరిగే అవకాశం ఉందని అంచనా .ఓలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులు సులభంగా ఎక్కేందుకు, దిగేందుకు అనువైన లో-ఫ్లోర్ డిజైన్, విశాలమైన, సౌకర్యవంతమైన సీటింగ్, పూర్తిగా పర్యావరణహిత జీరో ఎమిషన్ టెక్నాలజీ, శబ్ద కాలుష్యాన్ని ఆధునిక వ్యవస్థ, అత్యాధునిక భద్రతా సదుపాయాలు , నగర ప్రయాణాలకు అనువైన సాఫ్ట్ మరియు సౌకర్యవం తమైన రైడింగ్ అనుభవం కలిగి ఉన్నాయి. టీజీఎస్ఆర్టీసీ , ఈవీ ట్రాన్స్ సంస్థలు సంయుక్తంగా అమలు చేసిన ఈ 500 బస్సుల ప్రాజెక్టు, హైదరాబాద్ నగరంలో గ్రీన్ మొబిలిటీ ప్రోత్సాహానికి, ప్రపంచ స్థాయి ప్రజా రవాణా సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా నగర కాలుష్యం తగ్గడం, ప్రజా రవాణా సేవల ప్రాప్తి పెరగడం, అలాగే పెద్ద స్థాయిలో ఎలక్ట్రిక్ మొబిలిటీ వినియోగం పెరగడం వంటి ప్రయోజనాలు నగరానికి లభించనున్నాయి.

# హైదరాబాద్ మెట్రోకు ఊపిరి...



**హైదరాబాద్, మే 27 పెన్ పవర్:** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ అప్పులను తీర్చడం(రీఫైనాన్స్) కోసం ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ సంస్థకు.. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.13,527 కోట్ల భారీ రుణాన్ని మంజూరు చేసింది. ఈ డీల్ వార్త బయటకు రాగానే షేర్ మార్కెట్‌లో ఐఆర్ఎఫ్‌సీ షేర్లు 4 శాతం పెరిగి రూ.102 కి చేరుకున్నాయి.మెట్రో ప్రాజెక్ట్ కోసం గతంలో ఎక్కువ వడ్డీకి తీసుకున్న పాత అప్పులను తీర్చేసి.. వాటి స్థానంలో తక్కువ వడ్డీకి, ఎక్కువ కాలపరిమితితో కొత్త అప్పును తీసుకోవడాన్నే 'రీఫైనాన్సింగ్' అంటారు. ఈ రూ13,527 కోట్ల రుణాన్ని 20 ఏళ్ల పాటు ప్రతి మూడు నెలలకొకసారి ఈఎంఐ (త్రైమాసిక వాయిదాలు) రూపంలో మెట్రో సంస్థ చెల్లిస్తుంది.ఈ అప్పు తీసుకోవడానికి ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు గానీ, ముందే అప్పు తీర్చేస్తే వేసే పెనాల్టీలు గానీ లేవు. దీనివల్ల మెట్రో ప్రాజెక్టుపై ఆర్థిక భారం చాలా వరకు తగ్గుతుంది.హైదరాబాద్ మెట్రో ప్రస్తుత పరిస్థితి చూసుకుంటే.. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 ప్రాజెక్టులో 3 కారిడార్లలో 57 స్టేషన్లతో మొత్తం 69.2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం మోడల్‌లో ప్రపంచంలోనే నిర్మించిన అతిపెద్ద మెట్రో ప్రాజెక్టులలో ఇది ఒకటి. ప్రస్తుతం రోజూ 5 లక్షల మందికి పైగా ప్రయాణికులు మెట్రోలో ప్రయాణిస్తున్నారు.ఈ ఆర్థిక ఊరట వల్ల తెలంగాణ ప్రభుత్వం తదుపరి మెట్రో విస్తరణ పనులను (కొత్త రూట్లు, లాస్ట్ మైల్ కనెక్టివిటీ) మరింత వేగవంతం చేసే అవకాశం ఉంటుందిసాధారణంగా ×=ఖీజ సంస్థ కేవలం రైల్వే రంగానికి (రైళ్లు, పట్టాల నిర్మాణం) మాత్రమే నిధులు సమకూరుస్తుంది. కానీ ఇప్పుడు మొదటిసారిగా మెట్రో లాంటి పబ్లిక్ యుటిలిటీ (ప్రజా రవాణా) మౌలిక సదుపాయాలకు కూడా అప్పులు ఇవ్వడం ప్రారంభించింది. తమ వ్యాపారాన్ని ఇతర రంగాలకు విస్తరించడంలో ఇదొక పెద్ద అడుగు అని కంపెనీ పేర్కొంది.జూలై 2024 లో ఈ షేర్ ధర అత్యధికంగా రూ.229 కి చేరింది. ఆ తర్వాత కాలంలో ఈ షేర్ భారీగా పతనమై దాదాపు 56 శాతం విలువను కోల్పోయింది. వరుసగా మూడేళ్లు లాభాలు ఇచ్చిన ఈ స్టాక్.. 2025లో 17 శాతం నష్టాన్ని మిగిల్చింది. ఈ 2026 సంవత్సరంలో కూడా ఇప్పటివరకు 20 శాతం మేర పడిపోయింది. ప్రస్తుతం జరిగిన ఈ రూ.13,527 కోట్ల మెట్రో డీల్ తర్వాత ఈ షేర్ మళ్లీ పుంజుకుంటుందని పెట్టుబడిదారులు ఆశిస్తున్నారు.

# జూన్ 5 తర్వాతే తెలంగాణకు రుతుపవనాలు

**హైదరాబాద్, మే 27 పెన్ పవర్:** ఈ ఏడాది భారత్‌లో పలు రాష్ట్రాల్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని కొన్ని రోజుల కిందట ఐఎండీ తెలిపింది. అయితే ఈ ఏడాది వానాకాలం ఆలస్యంగా ప్రారంభం కానుంది. నైరుతి రుతుపవనాలు జూన్ ఐదో తేదీ తర్వాతే తెలంగాణ రాష్ట్రాన్ని తాకే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. దేశ దక్షిణ ప్రాంతాన్ని మే 25 నాడే తాకుతాయని తొలుత అంచనా వేశారు. కానీ ఎల్‌నినో పరిస్థితుల కారణంగా నైరుతి రుతుపవనాల కదలికల్లో వేగం తగ్గిందని అధికారులు తెలిపారు. హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో విస్తరిస్తూ వచ్చిన నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం శ్రీలంక సగం వరకు వచ్చి నిలిచిపోవడంతో ఆలస్యం కానుంది. సాధారణంగా మే చివరికల్లా తెలంగాణను తాకాల్సిన రుతుపవనాలు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జూన్ 5 నుంచి 10వ తేదీ మధ్య వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ కారణాలతో ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువ నమోదయ్యే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లోనూ వర్షాలపై ప్రభావం పడుతుందని తెలుస్తోంది. తెలంగాణలో భానుడి భగభగలు ఇలాగే కొనసాగుతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎండ తీవ్రత అధికంగా ఉండటం, ప్రజలు వడదెబ్బతో అధిక సంఖ్యలో చనిపోతుండటంతో కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది. జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్' జారీ చేయగా, అక్కడ 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో వడగాలులు వీస్తున్నందున ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఎన్నో కుటుంబాలలో ఎండ తీవ్రత, వడగాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అదే సమయంలో ద్రోణి కారణంగా కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రాష్ట్రం నిప్పుల కుంపటిలా మారింది. ఏపీలో సోమవారం ఒక్కరోజే 18 మంది చనిపోగా, తెలంగాణలో 54 మంది వడదెబ్బ, ఎండ తీవ్రత కారణంగా చనిపోయారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 46 డిగ్రీల పైన, మరో 6 జిల్లాల్లో 45.2 నుంచి 45.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 16 జిల్లాల్లోని 145 మండలాల్లో తీవ్ర వడగాలులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 19

మండలాలు, మంచిర్యాలలో 17 మండలాల్లో, సూర్యాపేటలో 14, ఖమ్మంలో 13 మండలాలతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాలు ప్రజలు ఎండ వేడికి తట్టుకోలేకపోతున్నారు. ఏపీలోని కృష్ణా జిల్లాలోని కంకిపాడు, పెనమలూరు ప్రాంతాలలో గరిష్ఠంగా 48.1 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదు కాగా, బాపట్ల జిల్లా కూచినపూడిలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. మొత్తం 14 జిల్లాల పరిధిలో ఉన్న 115 మండలాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటడం ఎండ తీవ్రతను తెలుపుతుంది. ద్దం పడుతోంది. ఈ కోరలు చాచిన ఎండల వడదెబ్బకు తాళలేక వేర్వేరు ప్రాంతాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. మే నెలాఖరు వరకు ఎండల తీవ్రత ఇలాగే ఉంటుందని, ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

# వాట్సాప్ లో గ్రేటర్ సేవలు

**హైదరాబాద్, మే 27 పెన్ పవర్:** హైదరాబాద్‌లో బర్త్ సర్టిఫికెట్ సవరణ కోసమో లేదా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు కోసమో ప్రభుత్వ ఆఫీస్‌ల చుట్టూ తిరగడం అంటే అగ్నిపరీక్షే. కానీ, మారుతున్న కాలంతోపాటు పాలన కూడా ప్రజల అరచేతిలోకి వచ్చేసింది. తెలంగాణ ప్రభుత్వ ఐటీ, కమ్యూనికేషన్ల విభాగం ఆధ్వర్యంలోని మీ సేవ ప్లాట్‌ఫామ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల కోసం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. తెలంగాణ మీ సేవ ప్లాట్‌ఫామ్ తన వాట్సాప్ చాట్‌బాట్ సేవలను మరింత విస్తరించింది. గతంలో ఉన్న సేవల కంటే అదనంగా, ఇప్పుడు తొమ్మిది కొత్త జీహెచ్ఎంసీ సేవలను ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో చేర్చారు. దీని వల్ల హైదరాబాద్ నివాసితులు తమ ఇంటి నుంచే కేవలం ఒక వాట్సాప్ మెసేజ్‌తో తమ పనులను పూర్తి చేసుకోవచ్చు. కార్యాలయాలకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండానే, నేరుగా చాట్ ఇంటర్‌ఫేస్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి వీలు కలుగుతుంది. ఆస్తి పన్ను సేవలు, పన్ను చెల్లింపులు, విచారణలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాపారస్తులు సులభంగా తమ లైసెన్స్‌లను అప్‌డేట్? చేసుకోవచ్చు. పేర్లు లేదా ఇతర వివరాలు జనన ధృవీకరణ పత్రాల్లో సవరణలు ఉంటే సరిదిద్దుకోవచ్చు. ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ చేసుకోవచ్చు. పేరు మార్పు, సవరణ, ఇంటి వద్ద జరిగిన జననాల నమోదు, ఇంటి వద్ద జరిగిన మరణాల నమోదు, ఇతర పౌర సేవలు ఇందులో పొందవచ్చు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పౌర సేవలను డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టింది. ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్, వాట్సాప్ అందుబాటులో ఉన్నాయి. ఇతర యాప్‌లు డౌన్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా పని పూర్తి అవుతుంది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే శ్రమ, రవాణా ఖర్చులు తప్పుతాయి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వం నుంచే సేవలు పొందవచ్చు. గత ఏడాది నవంబర్ 18న ప్రారంభమైన ఈ వాట్సాప్ ఛానెల్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆదాయ ధృవీకరణ పత్రాలు, పోలీసు చాలనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రజలు దీనిని విరివిగా వాడుతున్నారు. మీసేవ వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవడం చాలా సులభం. దీని కోసం మీరు ఫాలో చేయాల్సిన స్టెప్స్ ఉన్నాయి ముందుగా మీరు 8096958096 నెంబర్‌ను సేవ్ చేసి పెట్టుకోవాలి. వాట్సాప్‌లోకి వెళ్లి ఈ నెంబర్‌కు హాయ్, హాలో అని మెసేజ్ చేయాలి. మీరు మెసేజ్ పంపగానే చాట్‌బాట్ స్పందిస్తుంది. స్క్రీన్‌పై కనిపించే ప్రాంప్ట్‌లను అనుసరిస్తూ మీకు కావాల్సిన సేవను ఎంచుకోండి. ఒక వేళ ఆ సేవకు ఫీజు ఉంటే అక్కడే ఉన్న లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పేమెంట్ పూర్తి చేయవచ్చు.

# భూవివాదం వెనుక రాజకీయ నేతల హస్తం

**హైదరాబాద్, మే 27, పెన్ పవర్:** సినీ గేయరచయిత అనంత్ శ్రీరామ్ సోమవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యక్షమయ్యారు. జిల్లా యంత్రాంగం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని, తన కుటుంబానికి ఎదురవుతున్న వేధింపులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒక భూవివాదం కారణంగా తన వృద్ధులైన తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, వారికి తక్షణమే రక్షణ కల్పించాలని ఆయన విన్నవించారు.యలమంచిలి మండలం దొడ్డిపట్లలో తమకు ఉన్న 5 సెంట్ల ఉమ్మడి స్థలం విషయంలో వివాదం నెలకొందని అనంత్ శ్రీరామ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కొంతమంది అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆయన ఆరోపించారు. అయితే, ఈ వివాదంలో మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య కుమారుడు, చేగొండి సూర్యప్రకాష్ జోక్యం చేసుకుని తన తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపణలు చేశారు.సదరు స్థల వివాదం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, విచారణ జరుగుతుండగానే రాజకీయ పలుకుబడితో తమపై ఒత్తిడి తెస్తున్నారని అనంత్ శ్రీరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడకుండా, వృద్ధులైన నా తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. చట్టంపై గౌరవంతో తాను అధికారులను ఆశ్రయించినట్లు ఆయన మీడియాకు తెలిపారు. గ్రామంలో ఉంటున్న తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని, రాజకీయ నాయకుల అనుచరుల నుంచి వారికి ముప్పు పొంచి ఉందని అనంత్ శ్రీరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ , ఎస్పీకి తన ఫిర్యాదు ప్రతిని అందజేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వివాదాస్పద స్థలంలో యథాతథ స్థితి ని కాపాడాలని ఆయన కోరారు .అనంత్ శ్రీరామ్ ఫిర్యాదును స్వీకరించిన జిల్లా అధికారులు, ఈ అంశంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని యలమంచిలి తహసీల్దార్ , పోలీసు అధికారులను ఆదేశించారు. చట్టపరంగా బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంత్ శ్రీరామ్ , చేగొండి హరిరామ జోగయ్య కుటుంబాల మధ్య భూవివాదం ఉన్నా.. వారు సమీప బంధువులే. అనంత్ శ్రీరామ్ మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్యకు స్వయానా మేనల్లుడు. సొంత సోదరి కుమారుడు . అనంత్ శ్రీరామ్‌లోని సాహిత్య ప్రతిభను గుర్తించి, ఆయనను సినిమా రంగానికి పరిచయం చేయడంలో చేగొండి హరిరామ జోగయ్య కీలక పాత్ర పోషించారు. తన మేనల్లుడికి పాటల రచయితగా అవకాశాలు రావాలని జోగయ్య స్వయంగా అనేకమంది దర్శకులు, నిర్మాతల దగ్గర సిఫార్సు చేశారు. ఒకప్పుడు ఒకే గొడుగు కింద ఎదిగిన ఈ రెండు కుటుంబాల మధ్య ఇప్పుడు 5 సెంట్ల భూమి కోసం వివాదం చెలరేగడం, అది కలెక్టరేట్ మెట్లెక్కడం పశ్చిమగోదావరి జిల్లా రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**ఆయనే భూ కబ్జాదారుడు**

సినీ పాటల రచయిత అనంత శ్రీరామ్ , ఆయన బంధువు చేగొండి సూర్యప్రకాష్ మధ్య మొదలైన ఆస్తి వివాదం ఇప్పుడు రాజకీయ, న్యాయపరమైన మలుపులు తిరుగుతోంది. అనంత శ్రీరామ్ తన కుటుంబానికి రక్షణ కల్పించాలని, తన తల్లిదండ్రులను సూర్యప్రకాష్ బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై సూర్యప్రకాష్ ఘాటుగా స్పందించారు. అనంత శ్రీరామ్ చేస్తున్న ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని, తనపై కావాలనే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.అనంత శ్రీరామ్ తన డబ్బు, పరపతి, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తనను వ్యక్తిగతంగా వేధిస్తున్నారని సూర్యప్రకాష్ ఆరోపించారు. తనపై కక్షపూరితంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ క్రమంలోనే ఆయనపై పరువు నష్టం దావా వేయబోతున్నట్లు ప్రకటించారు. తన చరిత్ర నిష్కళంకమని, తనపై ఇప్పటివరకు కనీసం ఒక్క పోలీస్ కేసు కూడా లేదని ఈ సందర్భంగా ద

సూర్యప్రకాష్ గుర్తు చేశారు. అనంత శ్రీరామ్ మాటలకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.అసలు వివాదం ఆస్తికి సంబంధించిందని సూర్యప్రకాష్ వివరించారు. తన తాతయ్య చేగొండి కృష్ణమోహన్ రావుకు చెందిన ఆస్తిని అనంత శ్రీరామ్ అక్రమ మార్గాల్లో స్వాధీనం చేసుకున్నారని ఆయన సంచలన ఆరోపణ చేశారు. ఆ ఆస్తిని కాజేసేందుకే తనను అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నారని, అందుకే ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంత శ్రీరామ్ ఒక "పెద్ద భూ కబ్జా రాయుడు" అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.అనంత శ్రీరామ్ తల్లిదండ్రులను తాను బెదిరించినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని సూర్యప్రకాష్ తేల్చి చెప్పారు. నేను వారిని బెదిరించినట్లు కనీసం ఒక్క ఆధారమైనా నిరూపిస్తే దేనికైనా సిద్ధం అని ఆయన సవాల్ విసిరారు. లేనిపోని ఫిర్యాదులతో అధికారులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. కేవలం తన స్వార్థం కోసం వృద్ధులైన తల్లిదండ్రులను ఈ వివాదంలోకి లాగడం సరికాదని ఆయన విమర్శించారు.ఒకవైపు అనంత శ్రీరామ్ తన తల్లిదండ్రులకు ప్రాణాలకు ముప్పు ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, మరోవైపు సూర్యప్రకాష్ భూ కబ్జా ఆరోపణలు చేస్తూ కోర్టుకు వెళ్తామనడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై అధికారులు ఎలాంటి విచారణ జరుపుతారో ,పోలీసులు ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాలి.

# పాలమూరుకు తగ్గనున్న నీటి కష్టాలు

## బ్రిడ్జి నిర్మాణానికి రెండు రాష్ట్రాలు అంగీకారం

**మహబూబ్ నగర్, మే 27, పెన్ పవర్:** తెలంగాణ, కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దుల్లో కృష్ణానదిపై ఒక కొత్త బ్యారేజీతో పాటు వంతెనను నిర్మించేందుకు రెండు రాష్ట్రాల మధ్య కీలక చర్చలు ప్రారంభమయ్యాయి. ఉన్నత స్థాయి భేటీలో కర్ణాటక ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తీసుకురాగా.. తెలంగాణ ప్రభుత్వం కూడా దీనిపై సానుకూలత వ్యక్తం చేస్తూ పరిశీలిస్తోంది. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం కృష్ణా మండల పరిధిలోని కొల్హారు గ్రామానికి, కర్ణాటకలోని రాయచూరు జిల్లా కోర్కుందా గ్రామానికి మధ్యలో ఈ బ్యారేజీని నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జూరాల జలాశయానికి ఎగువన, కర్ణాటకలోని గుర్జాపూర్, గూగల్ చిన్న బ్యారేజీలకు దిగువన ఈ కొత్త ప్రాజెక్టు రానుంది.సుమారు రెండు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ బ్యారేజీని నిర్మిస్తే.. తెలంగాణలోని మక్తల్ నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలకు తాగు, సాగునీటి అవసరాలు పూర్తిగా తీరనున్నాయి. నీటి లభ్యతతో పాటు ఈ బ్యారేజీపై వంతెనను కూడా నిర్మించడం వల్ల ప్రస్తుతం రాయచూరు సమీపంలోని శక్తినగర్, కృష్ణా మండలం మధ్య ఉన్న పాత వంతెనపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు భీమా నదిపైనా మరో చిన్న బ్యారేజీ, వంతెన నిర్మించాలనే ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. సోమవారం నాటి సమావేశంలో తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి ఈ కొత్త ప్రతిపాదనను కర్ణాటక ప్రతినిధుల ముందుకు తీసుకెళ్లారు.నారాయణపేట జిల్లాలోని తంగడిగి, కర్ణాటకలోని సుగూరు గ్రామాల మధ్య భీమానదిపై 0.25 టీఎంసీల సామర్థ్యంతో దీనిని నిర్మించాలని కోరారు. ఈ చిన్న బ్యారేజీ నిర్మాణం వల్ల ఇరు రాష్ట్రాల సరిహద్దు రైతులకు, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. కృష్ణానదిపై ప్రతిపాదించిన ప్రధాన బ్యారేజీని రెండు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్మించి వ్యయాన్ని సమానంగా పంచుకోవడం ద్వారా ఉమ్మడిగా ప్రయోజనం పొందవచ్చనే కోణంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ అంతరాష్ట్ర ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం దాదాపు రూ.500 కోట్ల వరకు ఉండవచ్చని నీటిపారుదల రంగ నిపుణులు ప్రాథమికంగా లెక్కగట్టారు.కృష్ణానదిపై ప్రతిపాదించిన బ్యారేజీకి సంబంధించి హైడ్రాలజీ, ముంపు ప్రాంతాలు, సాంకేతికాంశాలను క్షుణ్ణంగా ఖరారు చేసేందుకు ఇరు రాష్ట్రాల నీటిపారుదలశాఖల ఇంజినీర్లతో ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని సోమవారం నాటి సమావేశంలో నిర్ణయించారు. ఈ ఉమ్మడి కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది. ఆ నివేదిక అందిన తర్వాత రెండు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు మరోమారు సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నారు

## మూసాపేట ఉడిపి హోటల్ లో బొద్దింకలు, ఈగలు

# సీజ్ చేసిన అధికారులు

**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎంసీ ఆహార భద్రతా బృందాలు మూసాపేటలోని ఉడుపి ఉపహార్ హోటల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో వంటగదిలో బొద్దింకలు, ఈగలు ఉండటం, డ్రైనేజీ జామ్ కావడం, వండిన బిర్యానీ, మంచూరియా, పిండి పదార్థాలను ఫ్రీజర్లో అపరిశుభ్రంగా నిల్వ ఉంచడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువు ముగిసిన ఫుడ్ లైసెన్స్తో హోటల్ నడుపుతుండటంతో అధికారులు ఆ ప్రాంగణాన్ని తక్షణమే సీజ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ కు తీవ్ర గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్ద అంబర్‌పేట్-హయత్ నగర్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ లారీ.. ముందు వెళ్తున్న మరో లారీని బలంగా ఢీకొట్టడంతో, టిప్పర్ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ క్యాబిన్ లోపల తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయి మృత్యువుతో పోరాడాడు.హయత్ నగర్ వైపు నుండి ఆటో నగర్ వైపు వెళ్తున్న ఒక లారీ టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆ లారీ రోడ్డు మధ్యలోని డివైడర్‌ను బలంగా ఢీకొట్టి ఆగిపోయింది. అయితే, అదే సమయంలో అదే మార్గంలో వెనుక నుండి అతివేగంగా దూసుకొచ్చిన ఒక టిప్పర్ లారీ.. డివైడర్‌ను ఢీకొట్టి ఆగి ఉన్న లారీని వెనుక భాగం నుండి అత్యంత బలంగా ఢీకొట్టింది.ఈ ఘోర ఢీకొట్టుడు ప్రభావానికి టిప్పర్ ముందు భాగం పూర్తిగా నలిగిపోయింది. దీంతో డ్రైవర్ సీట్ లోనే కూరుకుపోయి, క్యాబిన్ ఇనుప రేకుల మధ్య తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే హయత్ నగర్ పోలీసులు, 108 అత్యవసర సేవల సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఘటనా స్థలానికి చేరుకున్నారు.క్యాబిన్ పూర్తిగా నలిగిపోవడంతో డ్రైవర్‌ను బయటకు తీయడం పోలీసులకు సవాల్‌గా మారింది. గ్యాస్ కట్టర్లు, ఇతర పరికరాల సహాయంతో పోలీసులు, 108 సిబ్బంది సుమారు గంట సేపటి వరకు శ్రమించి క్యాబిన్ భాగాలను తొలగించారు. అత్యంత చాకచక్యంగా డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసి, ప్రాథమిక చికిత్స అనంతరం చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంత సమయం పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం.

## గచ్చిబౌలి నుండి శంషాబాద్ వైపు వస్తున్న రెండు కార్‌లు డికోని ఏడు మందికి గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ కమిషనరేట్ పరిధి ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధి రాళ్ళగుడా వద్ద ఔటర్ రింగ్ రోడ్డు పై రెండు కార్‌లు డికొని ప్రమాదంమరుతి బెలునో, మహెంద్ర ఎక్స్‌యువి700 కార్‌లు డికొన్నయి. ప్రమాదంలో ఏడు మందికి సల్ప గాయిలుసంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ వారిని హాస్పిటల్ కు తరలించారుప్రమాదంపై ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

## అత్తాపూర్ జాయ్ ఆసుపత్రిలో ఉద్రిక్తత:

## స్టంట్ వేస్తూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి..

### కుటుంబ సభ్యుల ఆందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:** వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణాలు కోల్పోయాడంటూ అత్తాపూర్ పరిధిలోని ప్రముఖ 'జాయ్ ఆసుపత్రి' వద్ద మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

**అసలేం జరిగిందంటే..?**

మధుబన్ కాలనీకి చెందిన శ్రీనివాసరావు (45) అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు మంచి క్రికెటర్‌గా, బ్యాట్స్‌మెన్‌గా కూడా స్థానికంగా గుర్తింపు ఉంది. కాగా, నిన్న రాత్రి శ్రీనివాసరావుకు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు మొదట సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.మరుసటి రోజు ఉదయం తదుపరి వైద్యం నిమిత్తం అత్తాపూర్ లోని జాయ్ (గ్రా×) ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు ఆయనకు యాంజియోగ్రామ్ పరీక్ష నిర్వహించగా.. గుండెలో ఎడమ వైపు 90 శాతం, కుడి వైపు 10 శాతం బ్లాక్‌లు ఉన్నట్లు గుర్తించారు. దీనికి చికిత్సలో భాగంగా వైద్యులు గుండెకు స్టంట్ వేసే ప్రక్రియను ప్రారంభించారు. అయితే, స్టంట్ వేస్తున్న సమయంలోనే శ్రీనివాసరావు అకస్మాత్తుగా మృతి చెందారు.

**వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆగ్రహం:**

ఆసుపత్రి యాజమాన్యం, వైద్యుల నిర్లక్ష్యం వల్లే శ్రీనివాసరావు ప్రాణాలు కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని స్టంట్ పేరిట ప్రాణాలు తీశారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు శ్రీనివాసరావు మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి కదిలించేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. ఈ క్రమంలో ఆసుపత్రి సిబ్బందిలో ఒకరిపై దాడి జరగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

**కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు:**

అప్పటివరకు తమతో ఎంతో యాక్టివ్‌గా ఉన్న శ్రీనివాసరావు అకస్మాత్తుగా మరణించడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నిండింది. శ్రీనివాసరావుకు 7 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. తండ్రి విగతజీవిగా పడి ఉండటం చూసి ఆ బాలుడు ఏడుస్తున్న తీరు అక్కడున్న వారిని తీవ్రంగా చలింపజేసింది.

**రంగంలోకి దిగిన పోలీసులు -- కేసు నమోదు:**

ఆసుపత్రి యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు అత్తాపూర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం శ్రీనివాసరావు బంధువులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి వారి నుంచి రాతపూర్వక ఫిర్యాదును స్వీకరించి, కేసు నమోదు చేశారు.

ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

# దుమ్మురేపుతున్న టాలీవుడ్...

**హైదరాబాద్, మే 27, పెన్ పవర్:**
తమిళ్ సినిమా ఇండస్ట్రీలో ఉన్న హీరోలు దర్శకులు ఒకప్పుడు ఘన విజయాలను సాధిస్తుండేవారు. అక్కడి హీరోలు, దర్శకులు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలోనే నెంబర్ వన్ పొజిషన్ లో ఉండేవారు. కానీ ఇప్పుడు రోజులు మారాయి తెలుగు సినిమా ఇండస్ట్రీ సౌత్ సినిమా ఇండస్ట్రీని పక్కకు నెట్టేసి ముందుకు దూసుకెళ్లడమే కాకుండా పాన్ ఇండియా ఇండస్ట్రీని సైతం పక్కన పెట్టేసింది. ప్రస్తుతం ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో తెలుగు సినిమా ఇండస్ట్రీ నెంబర్ పొజిషన్లో కొనసాగుతూ ఉండటం విశేషం...ఇక తమిళులు మాత్రం దీనిని ఒప్పుకోవడం లేదు. ఎలాగైనా సరే సూపర్ సక్సెస్ ని సాధించే దిశగా సినిమాలు చేయాలని అక్కడ స్టార్ హీరోలు విపరీతంగా ఆరాటపడుతున్నారు.కానీ రజినీకాంత్, కమల్ హాసన్ తో పాటు విజయ్, సూర్య, విక్రమ్ లాంటి హీరోలు ఎన్ని సినిమాలు చేసినా కూడా మన తెలుగు హీరోల స్టార్ డమ్ ను మ్యాచ్ చేయలేరు. అలాగే మన హీరోల కలెక్షన్స్ ను కొల్లగొట్టలేరు అంటూ చాలామంది కామెంట్స్ చేస్తున్నారు.ఇక తమిళ దర్శకులు సైతం అక్కడున్న హీరోలతో సినిమాలు చేస్తే వరకు కావడం లేదనే ఉద్దేశంతోనే బాలీవుడ్ వెళ్లి అక్కడ సినిమాలు చేస్తున్నారు. లేదంటే తెలుగు సినిమా ఇండస్ట్రీకి వచ్చి ఇక్కడ స్టార్ హీరోలతో సినిమాలు చేసి సక్సెస్ లను సాధించాలని చూస్తున్నారు...ప్రస్తుతం తమిళ్ సినిమా ఇండస్ట్రీలోని హీరోల హవా ముగిసిందనే చెప్పాలి.

ఒకప్పుడు మన స్టార్ హీరోలతో పోటీ పడినప్పటికి ఇప్పుడు పోటీపడే స్థాయిలో వాళ్లయితే లేరు. ఇక ఇలాంటి క్రమంలోనే రాబోయే రోజుల్లో బాక్సాఫీస్ ను షేక్ చేసే సినిమాలు చేస్తే తప్ప ఇండస్ట్రీలో వీళ్ళకంటూ ఒక స్ట్రెచర్ అయితే ఏర్పడదు. కాబట్టి ఏది ఏమైనా కూడా సౌత్ సినిమా ఇండస్ట్రీలో తమ సత్తా చాటుకోవాలంటే మాత్రం మరోసారి పెను సంచనాలను క్రియేట్ చేయాల్సిన అవసరమైతే ఉంది...చూడాలి మరి ఇక మీదట వాళ్ళు ఎలాంటి సక్సెస్ లను సాధిస్తారు అనేది...

# కామన్ మ్యాన్ పై పెట్రో భారం ఎఫెక్ట్...

**హైదరాబాద్, మే 27, పెన్ పవర్:** సామాన్యుడి జేబుకు మళ్లీ చిల్లులు పడబోతున్నాయి. ఇంధన ధరల పెంపు కేవలం వాహనదారులకే పరిమితం అనుకుంటే పొరపాటే.. దీని ప్రభావం ప్రతి సామాన్యుడి వంటింటి బడ్జెట్‌పై తీవ్రంగా పడనుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణంమళ్లీ పడగ విప్పనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే రోజుల్లో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 5 శాతం మార్కును తాకే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల తగ్గింపు విషయంలో వెనక్కి తగ్గే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఇంధన ధరల పెంపుతో దేశవ్యాప్తంగా రవాణా ఖర్చులు విపరీతంగా పెరుగుతాయి. దేశంలో సరుకు రవాణా వ్యవస్థ అంతా దాదాపుగా డీజిల్‌తో నడిచే భారీ ట్రక్కుల పైనే ఆధారపడి ఉంది. డీజిల్ రేటు పెరిగితే.. కూరగాయలు, పాలు, కిరాణా సరుకుల నుంచి ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల వరకు ప్రతి వస్తువు రవాణా భారం అమాంతం పెరుగుతుంది. ఈ అదనపు వ్యయాన్ని కంపెనీలు తమ లాభాల్లోంచి భరించవు, అంతిమంగా వినియోగదారుడి (సామాన్యుడి) పైనే మోపుతాయి. ఈ చైన్ రియాక్షన్ కారణంగానే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయని, తద్వారా ద్రవ్యోల్బణం మళ్లీ 5 శాతం వైపు పరుగులు తీస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఇదే సమయంలో గృహ, వాహన రుణాలు తీసుకున్న సామాన్యులకు, మధ్యతరగతి వర్గాలకు ఆర్బీఐ చేదువార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తే ఆర్బీఐ రెపో రేటు తగ్గిస్తుందని, తద్వారా తమ ఈఎంఐభారం తగ్గుతుందని ఎంతోకాలంగా ఆశగా ఎదురుచూస్తున్న వారికి నిరాశే ఎదురుకానుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రాథమిక లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడమే. కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద స్థిరంగా ఉంచాలని ఆర్బీఐ టార్గెట్ పెట్టుకుంది. కానీ ఇప్పుడు ఇంధన ధరల సెగతో అది 5 శాతానికి చేరువవుతుండటంతో, ఆర్బీఐ తన విధాన నిర్ణయాల్లో మరింత ఆచితూచి వ్యవహరించనుంది. త్వరలో జరగబోయే ద్రవ్య పరపతి విధాన కమిటీసమావేశంలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆర్థికవేత్తలు అంటున్నారు.ఒకవైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు.. దానికి తోడు ఆకాశాన్నంటుతున్న కూరగాయలు, కిరాణా సరుకుల ఖర్చులు.. మరోవైపు ఏమాత్రం తగ్గని బ్యాంక్ ఈఎంఐల భారం. వెరసి ప్రస్తుత ఈ ఆర్థిక పరిణామాలు రాబోయే త్రైమాసికంలో సామాన్యుడిని ఆర్థికంగా మరింత ఉక్కిరిబిక్కిరి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

# డిగ్రీ స్టూడెంట్స్ కు అదిరిపోయే సర్వీస్ ఫైనలియర్ స్టైఫండ్

**హైదరాబాద్, మే 27 పెన్ పవర్:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2026-27 విద్యాసంవత్సరానికి గాను 11 కొత్త అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్స్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. ఈ మూడేళ్ల కోర్సుల్లో చివరి ఏడాది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ప్రాక్టికల్ శిక్షణ పొందుతూ నెలకు రూ.7 వేల స్టైపెండ్ అందుకుంటారు. ఈ ఏడాది మొత్తం సీట్లను 11 వేలకు పెంచగా.. కనీసం 8 వేల సీట్లను భర్తీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ 12న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రముఖ పరిశ్రమలతో ఈ మేరకు అవగాహన ఒప్పందాలు జరగనున్నాయి.రాష్ట్రంలో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉపాధి లభించాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉన్నత విద్యాశాఖ కీలక అడుగులు వేసింది. విద్యార్థులకు సంప్రదాయ విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా ఉద్యోగ శిక్షణ ఇచ్చేందుకు అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్స్ కింద కొత్తగా 11 కోర్సులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రాబోయే విద్యాసంవత్సరం (2026-27) నుంచి అందుబాటులోకి తెచ్చారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ఆచార్య బీఎస్ మూర్తి, సీఐఐ విద్యా సలహాదారు శేఖర్‌రెడ్డిలతో కలిసి కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన వెల్లడించారు.ఈ మూడేళ్ల కాలపరిమితి గల డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులు తమ చివరి సంవత్సరం అంతా క్షేత్రస్థాయిలో వివిధ పరిశ్రమలు, కార్పొరేట్ కంపెనీలు, లేదా ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో ప్రత్యక్షంగా శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఆ అప్రెంటిస్‌షిప్ సమయంలో విద్యార్థులకు ఆర్థిక భరోసాగా నెలకు రూ.7 వేల చొప్పున స్టైపెండ్ కూడా చెల్లిస్తారు. ఈ వినూత్న కోర్సుల ద్వారా అప్రెంటిస్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులలో దాదాపు 80 నుండి 90 శాతం మందికి వారు శిక్షణ పొందిన సంస్థల్లోనే శాశ్వత ఉద్యోగాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందులో భాగంగా.. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జూన్ 12న సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పలు ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలతో ఉన్నత విద్యాశాఖ అధికారికంగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనుంది.విద్యార్థులు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ నోటిఫికేషన్ ద్వారా ఈ ఏఈడీపీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. గత విద్యాసంవత్సరంలో 16 రకాల కోర్సులకు గాను 6 వేల సీట్లు అందుబాటులో ఉండగా కేవలం 1,770 మంది మాత్రమే చేరారు. అయితే ఈసారి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే కోర్సులను చేర్చడంతో పాటు మరో 5 వేల సీట్లను అదనంగా పెంచారు. దీంతో మొత్తం సీట్ల సంఖ్య 11 వేలకి చేరగా.. ఈ విద్యాసంవత్సరంలో కనీసం 8 వేల సీట్లను భర్తీ చేయాలని విద్యాశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 94 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మొత్తం 27 రకాల ఏఈడీపీ కోర్సులు అందుబాటులో ఉంటాయని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన 11 కోర్సుల వివరాలను పరిశీలిస్తే.. బీఎస్సీ విభాగంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్, ఈ-మొబిలిటీ అండ్ బ్యాటరీ, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ హార్డ్‌వేర్, హార్టికల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్, ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ టెక్నాలజీ, డెయిరీ అండ్ పౌల్ట్రీ మేనేజ్‌మెంట్, ఎంబెడెడ్ సిస్టమ్స్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి 8 రకాల అధునాతన కోర్సులు ఉన్నాయి. అలాగే.. బీకాం విభాగంలో బిజినెస్ ఎనలిటిక్స్ కోర్సును, బీఏ విభాగంలో యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్, ఫిల్మ్ అండ్ టీవీ ప్రొడక్షన్ అనే 2 కొత్త కోర్సులను మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రవేశపెట్టారు.

# అంబులెన్స్ కు దారి లేక....రోగి ప్రాణాలు గాల్లోకి..

**సికింద్రాబాద్. పెన్ పవర్:**
బోయిన్ పల్లి అంబేద్కర్ నగర్ లో అమానుష సంఘటన చోటు చేసుకుంది.పోచయ్య అనే 60 ఏళ్ల వృద్ధుడికి గుండె సంబంధిత సమస్య రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్ కు సమాచారం అందించడంతో హుటాహుటిన అంబులెన్స్ అతని ఇంటికి చేరుకుంది.అతని ఆసుపత్రికి తీసుకువెళ్లే క్రమంలో రహదారికి ఇరువైపులా మార్కెట్ కు సంబంధించిన కూరగాయలు రవాణా చేసే ఇతర వాహనాలు నిలిపి ఉండడంతో అంబులెన్స్ కు దారి లేక అక్కడే చిక్కుకుంది.దాదాపు గంటసేపు అక్కడే అంబులెన్స్ చిక్కుకోవడంతో పోచయ్య పరిస్థితి క్షీణించడంతో గుండెపోటు వచ్చి అంబులెన్స్ లోని ప్రాణాలు కోల్పోయాడు.అంబులెన్స్ బయటకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో అంబులెన్స్ లో ఉన్న పోచయ్య చనిపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బోయిన్

పల్లి ప్రధాన రహదారిపై బైఠాయించారు.రహదారి పొడవునా వాహనాలు నిలపడంతో అంబులెన్స్ బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై ధర్నా చేస్తున్న స్థానికులను పోలీసులు సర్ది చెప్పి పంపించి వేశారు. ఈ ఘటనపై తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కమర్షియల్ రియల్ ఎస్టేట్ లో కింగ్... మన భాగ్యనగరం



**హైదరాబాద్, మే 27, పెన్ పవర్:** ప్రపంచవ్యాప్తంగా ఇబ్బందికరమైన వాతావరణం ఉంది. కార్పొరేట్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వెనకాడుతున్నాయి. ఉన్న ఉద్యోగులను సైతం తొలగిస్తున్నాయి. సాధ్యమైనంతవరకు మెరుగైన టెక్నాలజీతో.. తక్కువ మ్యాన్ పవర్ తో పనులు చేయించుకుంటున్నాయి. దీంతో కంపెనీల పెట్టుబడులు చాలా వరకు తగ్గిపోయాయి. కార్పొరేట్ ఆఫీస్ లీజు కూడా నేల చూపులు చూస్తోంది. ఇలాంటి సమయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది హైదరాబాద్.కమర్షియల్ రియల్ ఎస్టేట్లో హైదరాబాద్ కింగ్ లాగా దూసుకుపోతోంది. ముఖ్యంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు హైదరాబాద్ నగరంలో విస్తృతంగా ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో కార్యాలయాల స్థలాల లీజింగ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా లక్ష నుంచి పదిలక్షల విస్తీర్ణం వరకు విస్తీర్ణం ఉన్న కార్యాలయాలలో ఆయా సంస్థలు తమ పనులు మొదలుపెడుతున్నాయి. భారీ ధరకు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ప్రస్తుత ఏడాది తొలి త్రైమాసికంలో హైదరాబాద్ నగరంలో 69% అభివృద్ధి నమోదయింది. గతంలో ఇది 40 శాతం వరకు ఉండేది. గత ఏడాది ఇదే సమయానికి 26 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి లీజింగ్ జరిగింది.ఈ సంవత్సరం ఈ సమయానికి 44 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి అది పెరిగింది. అదే కాదు గడిచిన మూడు నెలల్లో ఏకంగా 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయాల లావాదేవీలు జరిగాయి. ఇందులో భారీ కార్యాలయాల స్థలాల వాటా 75% గా ఉంది. ఇందులో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న కార్యాలయాల వాటా 8 శాతం ఉంది. ఐదు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కంపెనీలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేశాయి. మిడిల్ రేంజ్ లో కార్యాలయాల స్థలాలు 50వేల నుంచి లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశాయి. వీటి వాటా ఏకంగా 17 శాతం ఉంది. ఇక 10 లక్షల చదరపు అడుగుల లీజింగ్ భాగంలో కూడా ఒప్పందం కుదిరింది. దీని వాటా కూడా రెండు నుంచి మూడు శాతం వరకు ఉండే అవకాశం ఉంది.ఇటీవల ఉబర్ కంపెనీ గ్లోబల్ క్యాబబులిటీ సెంటర్ విస్తరణ కోసం హైదరాబాద్ ఐటి కారిడార్ పరిధిలోని మీనాక్షి ఎకో పార్కులో ఏకంగా 9.1 లక్షల చదరపు అడుగుల కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. జనవరిలో వీరుని లీజుకు తీసుకుంది. దాదాపు మొత్తం 10 అంతస్తులో ఈ సంస్థ కార్యాలయాన్ని నిర్వహిస్తోంది. ప్రతి నెల దీనికి 5.86 కోట్ల అద్దె చెల్లిస్తోంది. చదరపు అడుగుకు 65 రూపాయల అద్దె చెల్లిస్తున్నట్టు సమాచారం. ప్రతి మూడు సంవత్సరాలకు 15% పెరుగుతుంది. పది సంవత్సరాలపాటు లీజు ఒప్పందం ఉంటుంది. మొత్తంగా 10 సంవత్సరాల వరకు చెల్లించే ఏకంగా 839 కోట్ల వరకు ఉంటుంది..హైదరాబాద్ నగరంలో ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద లీజింగ్ ఒప్పందంలో ఇది ఒకటి. హైదరాబాద్ నగరంలో స్థలాలు విస్తీర్ణంగా ఉండడం.. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యకలాపాలు సాగించే అవకాశం ఉండడం.. ఐటీ రంగం.. ఫార్మా రంగం అద్భుతంగా ఉండడంతో ఫైనాన్స్.. మొబిలిటీ వంటి రంగాలలో దిగ్గజాలుగా ఉన్న సంస్థలు హైదరాబాద్ నగరం వైపు దృష్టిసారిస్తున్నాయి. బెంగళూరు, ముంబై, చెన్నై వంటి నగరాలతో పోలిస్తే హైదరాబాదులో అద్దె తక్కువగా ఉంది. అందువల్లే కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయి.

# కాంగ్రెస్, ఎస్పీ పొత్తు సాధ్యమేనా




**లక్నో, మే 27, పెన్ పవర్:**
యూపీలో తిరిగి అధికారాన్ని చేపట్టాలని సమాజ్ వాదీ పార్టీ ఎత్తుగడలు వేస్తోంది. వరుసగా మూడు సార్లు బీజేపీ యూపీని పాలిస్తోంది. మాయావతి సారథ్యంలోని బీఎస్పీ అంత బలంగా లేదు. దీంతో ఆ ప్లేస్ ని భర్తీ చేయాలని అఖిలేష్ యాదవ్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.2024 లో బీజేపీని నిలువరించడానికి ఏ ఫార్ములా అయితే ఫాలో అయ్యారో.. 2027 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ అదే ఫార్ములతో వెళ్లాలని నిర్ణయించారు.కాంగ్రెస్ తో పొత్తును కొనసాగించడానికే అఖిలేష్ మొగ్గు చూపుతున్నారు. అయితే.. రెండు రోజుల క్రితమే కాంగ్రెస్ నేతలు బీఎస్పీ అధినేత్రి మాయావతి ఇంటికి వెళ్లి కలిశారు. దీంతో అఖిలేష్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. అందుకే వెంటనే కాంగ్రెస్ తోనే వుంటానని, సీట్ల సమస్య సమస్యే కాదని, విజయమే ముఖ్యమని ఠక్కుమని చెప్పుకొచ్చారు.కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన పార్లమెంటరీ నియోజకవర్గమైన రాయ్‌బరేలీ నుండి 'మిషన్ 2027'కు శంఖారావం పూరించారు. సీట్ల పంపకాల చర్చల సమయంలో తమ వాదనలను బలంగా వినిపించే లక్ష్యంతో, రాష్ట్రంలో అభ్యర్థులను మరియు పోటీ చేసే స్థానాలను ఎంపిక చేసే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది.మరోవైపు యూపీ ఎన్నికల్లో సమాజ్ వాదీతో పొత్తు కొనసాగుతుందని కాంగ్రెస్ కూడా ప్రాథమికంగా పేర్కొంటోంది. అయితే.. సీట్ల పంపకం విసయంలోనే భిన్నాభిప్రాయాలు వున్నాయి. గతంలో రెండు సందర్భాల్లో కాంగ్రెస్, ఎస్పీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసింది. తత్ఫలితంగా, ఒక ప్రశ్న ఉత్పన్నమవుతోంది: 2027లో ఎస్పీ మరియు కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకానికి 2017 ఎన్నికల ఫలితాలు ప్రాతిపదికగా నిలుస్తాయా, లేక 2024లో అనుసరించిన సూత్రాన్నే ఇక్కడ కూడా వర్తింపజేస్తారా? అని ప్రశ్నలు వస్తున్నాయి.యూపీ రాజకీయాల్లో కాంగ్రెస్ -- ఎస్పీ మధ్య పొత్తు వచ్చినప్పుడల్లా సీట్ల పంపకమే ప్రస్తావనకు వస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-కాంగ్రెస్ కూటమి చెక్కుచెదరకుండా కొనసాగుతుందా? ఎస్పీతో పొత్తు విషయంలో రాహుల్ గాంధీ మౌనం పాటిస్తున్నప్పటికీ, కాంగ్రెస్‌తో తమ కూటమి కొనసాగుతుందని అఖిలేష్ యాదవ్ మాత్రం స్పష్టంగా ప్రకటించారు.ఉత్తరప్రదేశ్‌లో, కాంగ్రెస్ మరియు ఎస్పీ (సమాజ్‌వాదీ పార్టీ) రెండు సందర్భాలలో కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. మొదటిసారిగా 2017 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఎస్పీ మరియు కాంగ్రెస్ ఒక కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలోకి దిగాయి; ఆ తర్వాత, 2024 లోక్‌సభ ఎన్నికలలో, ఈ రెండు పార్టీలు తమ ఎన్నికల అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మరోసారి చేతులు కలిపాయి. 2017లో, ఎస్పీ 311 స్థానాల్లో పోటీ చేయగా, కాంగ్రెస్ 114 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. ఈ స్థానాల్లో తొమ్మిదింటిలో, కాంగ్రెస్ మరియు ఎస్పీ మధ్య "స్నేహపూర్వక పోటీ" జరిగింది. ఈ సారి ఏం జరుగుతుందో చూడాలి

# స్టాక్ మార్కెట్లో ఏఐ కంపెనీలు

**ముంబై, మే 27, పెన్ పవర్:**
ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ **(AI)** సృష్టిస్తున్న ప్రకంపనలు గ్లోబల్ స్టాక్ మార్కెట్ ముఖచిత్రాన్నే మార్చేస్తున్నాయి. దలాల్ స్ట్రీట్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా సగర్వంగా వెలుగొందుతున్న భారత్‌ను.. ఒక చిన్న దేశమైన తైవాన్ వెనక్కి నెట్టేసింది. ఈ ఊహించని దెబ్బతో అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్‌ల తర్వాత ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా తైవాన్ అవతరించి సంచలనం సృష్టించింది.తాజా అంచనాల ప్రకారం తైవాన్ స్టాక్ మార్కెట్ విలువ 4.95 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగా, భారత మార్కెట్ విలువ 4.92 ట్రిలియన్ డాలర్ల వద్ద నిలిచి ఆరో స్థానానికి పడిపోయింది. తైవాన్ మనల్ని ఇలా ఒక్కసారిగా దాటేయడం వెనుక ఉన్న అసలు బలం.. 'ఏఐ' . కృత్రిమ మేధకు అవసరమైన అత్యాధునిక హార్డ్‌వేర్, చిప్‌లను తయారు చేయడంలో ప్రపంచంలోనే రారాజుగా ఉన్న 'తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ' ఈ అద్భుతాన్ని సుసాధ్యం చేసింది. ఒక్క టీఎస్ఎంసీ షేర్ల దూకుడుకే మార్కెట్ లెక్కలు మారిపోయాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి ఆ కంపెనీ షేర్లు ఏకంగా 49 శాతం లాభాలను కురిపించాయి. తైవాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీలో ఏకంగా 42 శాతం వాటా ఈ ఒక్క కంపెనీదే కావడం విశేషం. దీనికి తోడు దేశీయ ఫండ్స్ పెట్టుబడి పరిమితులను తైవాన్ ప్రభుత్వం సడలించడం కూడా అక్కడి మార్కెట్ బూమ్‌కు కలిసొచ్చింది.ప్రపంచమంతా ఏఐ జపంతో పరుగులు పెడుతుంటే, భారత్‌లో ఆ రంగంలో ప్రత్యక్షంగా సత్తా చాటే బలమైన టెక్ కంపెనీలు (డైరెక్ట్ ఏఐ ప్లేయర్స్) స్టాక్ మార్కెట్లో లేకపోవడం మనకు పెద్ద మైనస్‌గా మారింది. దీనికి తోడు అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు, మందగించిన కార్పొరేట్ కంపెనీల ఆదాయాలు వంటి కారణాలతో దేశీయ స్టాక్ మార్కెట్ గత కొంతకాలంగా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఈ ప్రతికూల పవనాలే మన మార్కెట్ వృద్ధిని నెమ్మదించేలా చేశాయి.స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) పరంగా తైవాన్ మనకంటే ఒక అడుగు ముందుకు వేసినప్పటికీ.. ఇక్కడ గమనించాల్సిన మరో కీలక వాస్తవం ఉంది. వాస్తవ ఆర్థిక సామర్థ్యం, స్థూల దేశీయోత్పత్తి లెక్కల్లో చూసుకుంటే మాత్రం తైవాన్ కంటే భారతదేశమే ఎంతో పటిష్టంగా, మెరుగైన స్థానంలో ఉందని ఆర్థిక నిపుణులు భరోసా ఇస్తున్నారు. తాత్కాలికంగా ఈక్విటీ మార్కెట్ విలువలో మార్పులు జరిగినా, భారత ఆర్థిక పునాదులు బలంగానే ఉన్నాయని, దీర్ఘకాలంలో మన వృద్ధిని ఎవరూ ఆపలేరని స్పష్టం చేస్తున్నారు.

# పవన్ సరే.. బిజెపి సంగతేంటి!?



**కాకినాడ, మే 27 పెన్ పవర్:**
ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యవహారంపై స్పందించారు పవన్ కళ్యాణ్. అమిత్ షా లాంటి గొప్ప వ్యక్తిని కలిసినప్పుడు అరెస్టులు గురించి ప్రస్తావిస్తామా? అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అంతటి పెద్దలను కలిసి విన్నవిస్తే.. ఇలా విశ్లేషించడం ఏంటని గట్టిగానే నిలదీశారు పవన్ కళ్యాణ్. అయితే ఇంతటి నిందారోపణలు పవన్ పై రాగా.. బిజెపి వ్యూహాత్మక మౌనం పాటించడం మాత్రం కూటమి ధర్మానికి విఘాతం కలిగిస్తోంది. తిరిగి బిజెపి పైనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బిజెపి సైలెన్స్ ఎంతలా అంటే.. వైసిపి విషయంలో సాఫ్ట్ కార్నర్ అన్నట్టు ప్రజల్లోకి సంకేతాలు వెళ్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్ పై కూటమిలోని రెండు పార్టీలు గట్టిగా నిలదీస్తుండగా.. బిజెపి మాత్రం మౌనం వహిస్తోంది.ఆది నుంచి బిజెపి వైయస్సార్ కాంగ్రెస్ విషయంలో సాఫ్ట్ కార్నర్ తో ఉందన్న టాక్ ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా దానిని బాగా హైలైట్ చేస్తోంది. తద్వారా తప్పనిసరి పరిస్థితుల్లోనే బిజెపి టిడిపి తో కలిసిందని.. అవసరమైన పక్షంలో వైసీపీ నుంచి పరస్పర రాజకీయ ప్రయోజనాలు అందుకునేందుకు సిద్ధంగా ఉందని ప్రచారం మొదలుపెట్టారు. జగన్మోహన్ రెడ్డి విషయంలో బిజెపి ఉదాసీనంగా ఉందని చెప్పడానికి ఆయన బెయిల్ రద్దు, వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణలో జాప్యం వంటి వాటిని ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు విశ్లేషకులు. ఈ క్రమంలోనే ప్రొఫెసర్ నాగేశ్వర్ ఏకంగా పవన్ కళ్యాణ్ పై బాంబు పేల్చారు. అందుకు జనసేనతో పాటు పవన్ రియాక్ట్ అయ్యారు. కానీ టిడిపి విషయంలో బిజెపి ఆలోచన అది అని.. జగన్మోహన్ రెడ్డి శాశ్వత మిత్రుడు బిజెపి కని చెప్పారు ప్రొఫెసర్ నాగేశ్వర్. దానిని ఖండించాల్సిన అవసరం బిజెపికి ఉంది. లేకుంటే అదే నిజం అని జనాలు నమ్మక తప్పదు.ప్రొఫెసర్ నాగేశ్వర్ కమ్యూనిస్టు భావజాలం ఉన్న వ్యక్తి. పైగా ఆధారాలు లేకుండా బిజెపి అగ్రనేత ఆదేశాలు అన్నట్టు మాట్లాడారు. దానిని ఖండించాల్సిన బీజేపీ నేతలు ఇప్పుడు అదే నాగేశ్వర్ ను సమర్థిస్తున్నారు. తెలంగాణ బిజెపి నేత మురళీధర్ రావు ప్రొఫెసర్ నాగేశ్వర్ మంచి విశ్లేషకుడు అన్నట్టు కితాబు ఇచ్చారు. ఆయన తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్న తర్వాత కూడా పోలీస్ కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. దీంతో నాగేశ్వర్ చెప్పింది నిజమే అన్నట్టు సంకేతాలు ఇచ్చారు. అయితే ఆది నుంచి బిజెపి విధానం ఇదే. ఏపీతో వింత రాజకీయం ఆడుతోంది. ఇక్కడున్న రాజకీయ పరిస్థితులకు తగ్గట్టు వ్యవహరించి రాజకీయ లబ్ధి పొందుతోంది. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్లో మాత్రం బిజెపి వైఖరి ఇప్పుడు అంతటా చర్చ నడుస్తోంది.

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. తన సహచర మంత్రి నాదెండ్ల మనోహర్ తో ఢిల్లీ వెళ్లారు.. అక్కడ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో భేటీ అయ్యారు. అక్కడ వారి మధ్య ఏం జరిగిందో తెలియదు. కాకపోతే 25 నిమిషాల పాటు మాట్లాడుకున్నారు. ఏం మాట్లాడుకున్నారో తెలియకపోయినాప్పటికీ.. మీడియాకు మాత్రం వచ్చే ఎన్నికల్లో కూడా మూడు పార్టీలు కలిసి పోటీ చేయాలని.. ఏపీ రాష్ట్రాన్ని బాగు చేయాలని చర్చించుకున్నట్లు చెప్పారు. ఇది ఇలా ఉంటే ప్రముఖ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ మాత్రం మరో విధంగా చెప్పారు. జగన్మోహన్ రెడ్డిని అరెస్ట్ చేయాలని అమిత్ షా ముందు పవన్ కళ్యాణ్ ప్రతిపాదన తెచ్చారని.. దానికి ఆయన ఒప్పుకోలేదని.. జగన్మోహన్ రెడ్డిని తమ లాంగ్ టర్మ్ పొలిటికల్ ఫ్రెండ్ గా భావిస్తున్నట్టు అమిత్ షా చెప్పారని.. నాగేశ్వర్ అన్నారు.నాగేశ్వర్ అన్న ఈ మాటలు క్యాజువల్ గానే ఉండవచ్చు. పాలిటిక్స్ ను అంతర్గతంగా స్టడీ చేసే వారికి వేరే విధంగా అనిపిస్తాయి . ప్రొఫెసర్ నాగేశ్వర్ నుంచి ఎప్పుడైతే ఈ మాటలు బయటికి వచ్చాయో.. అప్పుడే వైసిపి మీడియా అలర్ట్ అయిపోయింది. వెంటనే తన సోషల్ మీడియా ద్వారా.. మీడియా ద్వారా కావలసిన ప్రచారం చేసుకుంది. ఇది ఏపీ రాజకీయాలలో ఎంత మంట పుట్టించాలో అంత మంట పుట్టించింది. ఆ తర్వాత జనసేన రంగంలోకి వచ్చింది. టిడిపి.. బిజెపి ఇలా ఎదురుదాడి మొదలైంది. మొత్తంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యవహారం మరో లైన్ తీసుకుంది.ఈ క్రమంలో నాగేశ్వర్ తనను తాను సెల్ఫ్ డిపెండ్ చేసుకుంటూ.. తాను తెలంగాణ ప్రాంత వాడినని.. ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన రాజకీయాలతో తనకేంటి అవసరమని వ్యాఖ్యానించారు. అవసరమైతే తనను అరెస్ట్ చేసుకోవాలని సవాల్ విసిరారు.. అంతకుముందు నాగేశ్వర్ ను అరెస్ట్ చేస్తే హైదరాబాదులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటిని ముట్టడిస్తామని టిఆర్ఎస్ అధినేత్రి కవిత హెచ్చరించారు. మరోవైపు పవన్ కళ్యాణ్ కూడా నాగేశ్వర్ వ్యవహారంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన తర్వాత కులాన్ని.. ప్రాంతాన్ని ఆపాదించడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లోకి తాను అన్ని వదులుకొని వచ్చానని.. ఎదురు దాడికి దిగితే పరిస్థితి వేరే విధంగా ఉంటుందని హెచ్చరించారు.. పవన్ కళ్యాణ్ హెచ్చరించిన కొద్దిసేపటికి ప్రొఫెసర్ నాగేశ్వర్ స్పందించారు. తనను అరెస్ట్ చేసుకోవచ్చని.. దానికి సిద్ధంగా ఉన్నానని..క్వాష్ పిటిషన్ వేయలా వద్దా.. అనే దానిపై ఇంకా ఆలోచించుకోలేదని నాగేశ్వర్ పేర్కొన్నారు. . ఇప్పటికే నాగేశ్వర్ కు అనుకూలంగా వైసీపీ మీడియా.. బిఆర్ఎస్ మీడియా వ్యవహరిస్తున్నాయి. మధ్యలో కవిత కూడా సపోర్ట్ ఇస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం రెండు ప్రాంతాలకు మధ్యదిగా మారిపోయింది. అయితే ఇది ఎక్కడి దాకా దారితీస్తుందో చూడాల్సి ఉంది.

# వైసీపీ నుంచి జంపింగ్స్...

**విజయవాడ, మే 27 పెన్ పవర్:**
ఏపీలో ఎన్నో పార్టీలు ఉన్నాయి. కానీ ప్రధాన పార్టీలు మాత్రం కొన్నే ఉన్నాయి. అందులో మూడు అధికార కూటమిలో చేరిపోయాయి. టీడీపీ జనసేన బీజేపీ ఒక జట్టు కట్టాయి. ఒక అయిదేళ్ళ పాటు ఏపీని పాలించిన వైసీపీ విపక్షంలో ఉంది. విపక్షంలో చూస్తే కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలు కూడా ఉన్నాయి. కానీ ఇవేమీ ఏపీలో బలమైన పరిస్థితులలో లేవు. ఉనికి పోరాటం చేస్తున్నాయి. దాంతో విపక్షంలో బలంగా 40 శాతం ఓటు షేర్ తో ఉన్న ఏకైక పార్టీగా వైసీపీ ఉంది. అదృష్టం కలిసి వస్తే మరోసారి అందలం ఎక్కే పార్టీ కూడా వైసీపీ అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ నుంచి ఫిరాయింపు నేతలు పదుల సంఖ్యలో పార్టీని వీడిపోయారు. వారంతా కూడా కూటమి వైపు వెళ్ళారు. అలా తెలుగుదేశం బీజేపీ జనసేనలలో చేరిపోయారు. మరి కొంతమంది వైసీపీని వీడి ఏ పార్టీలో చేరకుండా పరిస్థితిని గమనిస్తున్నారు. ఇదంతా కూడా తొలి ఏడాదిలోనే జరిగిపోయింది. ఆ తరువాత చూస్తే వైసీపీ నుంచి పెద్దగా జంపింగులు అయితే లేవు. దానికి కారణం వైసీపీని వీడి వెళ్ళిన వారు కూటమి పార్టీలలో సరైన ప్రాధాన్యత పొందకపోవడం. కండువా కప్పుకున్న రోజు తప్ప నాటి నుంచి నేటి వరకూ ఎక్కడా పెద్దగా కనిపించకపోవడమే. దాంతో మిగిలిన వారు కూడా పునరాలోచనలో పడ్డారు అని అంటున్నారుఇక చూస్తే రెండేళ్ళ కూటమి పాలన ముగిసింది. మరొ రెండేళ్ళు గట్టిగా కాలం కదిలితే చాలు చివరి ఏడాది ఎన్నికలు వచ్చేస్తాయి. రెండేళ్ళ తరువాత మెల్లగా యాంటీ ఇంకెంబెన్సీ అన్నది మొదలవుతుంది. దాంతో జనాభిప్రాయం ఏమిటి అన్నది కూడా వెల్లడి అవుతుంది. దానిని గ్రహిస్తూ ముందుకు సాగే వైసీపీ నేతలు ఎవరూ ఇక గడప దాటేది ఉండదని వైసీపీ పెద్దలు అంచనా వేసుకుంటున్నారు. వైసీపీలో ఉన్న వారు కూడా బయటకు వెళ్తే చేసేది ఏదీ లేదని కూడా ఒక నిర్ధారణకు వచ్చారని అంటున్నారు. ఇలా వైసీపీలో ఇపుడు ఉన్న నాయకులు అంతా కచ్చితంగా ఎన్నికల దాకా కొనసాగుతారు అని ధీమాగా వైసీపీ పెద్దలు ఉన్నారు.: ప్రాంతీయ పార్టీలు అన్నీ అధినేత ఫేస్ చూసి మాత్రమే మనుగడ సాగిస్తూ ఉంటాయి. అలా జగన్ ఇమేజ్ ని చూసే వైసీపీలో నేతలు ఉంటున్నారు అని అంటున్నారు వైసీపీ గ్రాఫ్ కూడా నెమ్మదిగా పెరిగే అవకాశాలు ఉన్నాయని నాయకులు భావిస్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న వారికి అధినేత న్యాయం చేస్తారు అన్న ఆలోచనలో చాలా మంది ఉన్నారు. నిజానికి ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ దాకా కొందరు బిగ్ షాట్స్ మాజీ మంత్రులు సీనియర్ నేతలు అంతా పార్టీని వీడాలని ఒకనొక సమయంలో నిర్ణయం తీసుకున్నా ఎందుక వెనకడుగు వేశారు. కొన్నాళ్ళ పాటు వారంతా మౌనంగా ఉన్నా ఇపుడిపుడే మీడియా ముఖం చూస్తున్నారు. ఆ విధంగా అధినేత కళ్ళల్లో పడి తాము యాక్టివ్ గా ఉన్నామని చెప్పుకోవడం ద్వారా వైసీపీలో అవకాశాలను అందుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. ఏపీలో సరైన పోటీ ప్రతిపక్షం లేకపోవడమే వైసీపీకి ఒక విధంగా అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ఇష్టం ఉన్నా లేకపోయినా కూటమి కాకపోతే వైసీపీనే ఎంచుకోవాల్సి వస్తోంది అని అంటున్నారు. దాంతో వైసీపీకి పెద్ద ఇబ్బంది లేకుండా పోతోంది అని అంటున్నారు ఇక వైసీపీలో కొనసాగుతున్నారని నాయకులకు పదవులు ఇచ్చే సీన్ ఉంటుందా అన్నది కూడా ఒక ప్రశ్న. పార్టీకి పనికి వచ్చే వారు ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే ఈసారి టికెట్లు ఇస్తారని అంటున్నారు. జగన్ గతంలో ప్రతిపక్షంలో ఉన్నపుడు అందరూ పనిచేయడం చూశారు, అధికారంలో అయిదేళ్ళూ అంతా పార్టీలో హడావుడి చేయడమూ చూశారు, ఇపుడు విపక్షంలోకి వచ్చాక పార్టీని వీడి వెళ్ళిన వారు ఉన్నా సైలెంట్ గా గడిపిన వారినీ చూశారని అందువల్ల వైసీపీలో ఎవరు ఏమిటో జగన్ కి బాగా తెలుసు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే వైసీపీ నుంచి భారీ జంపింగులు అయితే జరిగేది ఇక మీదట ఉండబోదు అన్న భరోసా అయితే కనిపిస్తోంది అని అంటున్నారు.



# జూన్ 15 నుంచి ఏపీలో సర్

**విజయవాడ, మే 27 పెన్ పవర్:**
రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి భారీ యంత్రాంగాన్ని రంగంలోకి దించుతున్నారు. మొత్తం 46,397 మంది బూత్ స్థాయి అధికారులు జూన్ 15 నుంచి జూలై 14 వరకు నేరుగా ఓటర్ల ఇళ్ల వద్దకే వచ్చి సర్వే నిర్వహిస్తారుఈ ఎన్యుమరేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీల తరపున నియమించిన 68,868 మంది బూత్ స్థాయి ఏజెంట్లు (BLAs) కూడా బీఎల్వోలకు సహాయకరంగా వ్యవహరిస్తారు. నకిలీ ఓట్ల తొలగింపు, మరణించిన వారి పేర్లను తొలగించడం, కొత్త ఓటర్ల చేరికను పారదర్శకంగా చేపట్టడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశం.

**ఓటర్ల జాబితా సవరణ – ముఖ్యమైన తేదీలు:**

జూన్ 6 నుంచి జూన్ 14 వరకు : ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు, అధికారులకు శిక్షణ అవసరమైన ఫారాల ప్రింటింగ్ ప్రక్రియ జరుగుతుంది.

జూన్ 15 నుండి జూలై 14 వరకు : బీఎల్వోల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే జరుగుతుంది. ఇదే సమయంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా జూలై 14 లోగా పూర్తి చేస్తారు.

జూలై 2 1: సేకరించిన ప్రాథమిక వివరాల ఆధారంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురిస్తారు.

జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు: ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు తెలపడానికి, కొత్తగా ఓటు హక్కు కోసం క్లెయిమ్‌లు దాఖలు చేయడానికి ఓటర్లకు అవకాశం కల్పిస్తారు.

జూలై 21 నుండి సెప్టెంబరు 18 వరకు : వచ్చిన క్లెయిమ్‌లు, నోటీసులు మరియు అభ్యంతరాలన్నింటినీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తారు.

సెప్టెంబరు 22 : అన్ని సవరణలు పూర్తి చేసిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తుది ఓటర్ల జాబితానుఅధికారికంగా విడుదల చేస్తారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఓటర్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు అందరూ భాగస్వాములు కావాల్సిన ఒక కీలకమైన ప్రక్రియ అని సీఈవో వివేక్ యాదవ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా మరియు లోపాలు లేకుండా జరగాలనేదే ఎన్నికల సంఘం లక్ష్యమని ఆయన వివరించారు. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో తమ బూత్ స్థాయి ఏజెంట్లను ) తప్పనిసరిగా నియమించాలని.... ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించి ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వివేక్ యాదవ్ కోరారు.

## బీజేపీకి వైసీపీ ఫ్రెండ్లీ వార్నింగ్?



**విజయవాడ, మే 27 పెన్ పవర్:** : రాజకీయాల్లో ఏ చర్య వెనుకైనా ఒక బలమైన వ్యూహం, ఆశించిన లక్ష్యం ఉంటాయి. ఏపీలో ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై చేపట్టిన నిరసనలు ఈ కోవలోకే వస్తాయి. రాష్ట్రానికి సంబంధించిన స్థానిక సమస్యలపై పెద్దగా గళమెత్తని వైసీపీ, ఒక్కసారిగా పెట్రోల్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునివ్వడం వెనుక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉందన్న అభఇప్రాయం వినిపిస్తోంది. పెట్రోల్ ధరల పెంపు అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం అయినప్పటికీ.. వైసీపీ నేతలు మాత్రం ఎక్కడా ప్రధాని మోదీని గానీ, కేంద్ర బీజేపీ నాయకత్వాన్ని గానీ విమర్శించడం లేదు. కేవలం రాష్ట్ర ప్రభుత్వంపైనే విమర్శల బాణాలు ఎక్కుపెడుతున్నారు. అడ్రస్ కేంద్రానిది అయితే, దాన్ని రాష్ట్రం మీదకు మళ్లించడం వెనుక ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్లాన్ ఉన్నట్లు భావిస్తున్నారు.వైసీపీ ఇస్తున్న ఈ సిగ్నల్స్ వెనుక ప్రధాన ఉద్దేశం.. తాము కేంద్రానికి వ్యతిరేకం కాదని, కానీ అవసరమైతే తమ దారి తాము చూసుకుని బీజేపీకి వ్యతిరేకంగా పోరాడగల సత్తా తమకు ఉందని నిరూపించడమే . ఢిల్లీ స్థాయిలో బీజేపీతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే, రాష్ట్రంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ–జనసేన కూటమిని ఇరుకున పెట్టడం ఈ వ్యూహంలోని ప్రధాన భాగం. మేము కేంద్రాన్ని ఏమీ అనడం లేదు, కానీ మీరు తగ్గించొచ్చు కదా అనే ప్రశ్న ద్వారా ప్రజల్లో అధికార కూటమిపై వ్యతిరేకత పెంచడమే వైసీపీ లక్ష్యం. ఇది బీజేపీకి పంపుతున్న ఒక రకమైన సాఫ్ట్ సిగ్నల్ .రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలు వరుసగా కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం అండ ఉంటేనే తాము సురక్షితంగా ఉంటామని వైసీపీ భావిస్తోంది. అందుకే డైరెక్ట్ గా కేంద్రంతో యుద్ధం పెట్టుకోకుండా.. రాష్ట్రానికి సంబంధించిన సెస్, వాట్ అంశాలను సాకుగా చూపిస్తూ నిరసనలు చేపడుతున్నారు. ఇలా చేయడం వల్ల కేంద్రానికి కోపం రాదు, అదే సమయంలో రాష్ట్రంలో తాము ప్రతిపక్షంగా యాక్టివ్ గా ఉన్నామనే సంకేతం కేడర్ కు వెళ్తుంది.ఒకవేళ మోదీపై నేరుగా విమర్శలు చేస్తే, సంబంధాలు దెబ్బతింటాయి. భవిష్యత్తులో సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి ఎదురయ్యే సవాళ్లను తట్టుకోవడం కష్టమవుతుందని వైసీపీకి తెలుసు. అందుకే, నిరసనల నినాదాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర పన్నుల వైపు మళ్లించారని అంచున్నారు. పెట్రోల్ ధరల్లో ఏపీ నంబర్ వన్ అని ప్రచారం చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికే చెడ్డపేరు వచ్చేలా చేస్తున్నారు తప్ప, ధరలు పెంచిన కేంద్రానికి ఏమీ కాకుండా జాగ్రత్త పడుతున్నారు. వైసీపీ చేస్తున్న ఈ పెట్రోల్ నిరసనలు కేవలం ధరల కోసమే అని అనుకుంటే పొరపాటే. ఇది పక్కాగా ఢిల్లీ పెద్దల మనసు గెలుచుకుంటూనే, గల్లీలో ఉన్న ప్రత్యర్థులను దెబ్బకొట్టే డబుల్ యాక్షన్ ప్లాన్. కేంద్రం పట్ల మౌనం పాటిస్తూ, రాష్ట్రంపై గగ్గోలు పెట్టడం వెనుక ఉన్న ఈ రాజకీయ చాణక్యం రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తెస్తుందో వేచి చూడాలి.

## బాలినేని కోసం రంగంలోకి పవన్

**ఒంగోలు, మే 27, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్ర నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా కొత్తవారి చేరికలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని చూస్తున్నారు. అయితే ఈ చేరికల విషయంలో జనసేన నేతలు అనుసరిస్తున్న వైఖరిపై పవన్ ఆగ్రహంగా ఉన్నారు. పార్టీని అభివృద్ధి చేయాలంటే చేరికలను ప్రోత్సహించాల్సిందేనని తేల్చి చెప్పారు. అయితే ఇటీవల కొన్ని జిల్లాల్లో పార్టీ క్రమశిక్షణ కట్టు దాటుతోంది. దీంతో పవన్ కళ్యాణ్ నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తున్నారు ఆ జిల్లాలపై. అందులో భాగంగా ప్రకాశం జిల్లా పార్టీ కార్యవర్గాన్ని రద్దు చేశారు. అక్కడ పార్టీ నేతలు అనుసరిస్తున్న తీరును తప్పు పట్టారు. ఒక నేతపై సస్పెన్షన్ వేటు కూడా వేశారు. పార్టీలో ఉంటే ఉండండి లేకపోతే వెళ్లిపోండి అంటూ తేల్చి చెప్పడం విశేషం. ఇటీవల జరిగిన పరిణామాలతోనే పవన్ సీరియస్ గా స్పందించినట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి జనసేనలో చేరారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి. ఆయన సీనియర్ మోస్ట్ లీడర్ కూడా. కానీ ఆయన రాకను ప్రకాశం జిల్లా నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చివరకు అధినేత పవన్ కళ్యాణ్ చెప్పిన వారి వైఖరి మారడం లేదు. దీంతో అధినేత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. క్రమంలోనే నిన్న జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రకాశం జిల్లా నేతలను ప్రత్యేకంగా పిలిపించుకున్నారు. అయితే ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ రియాజ్ ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఆయన మాజీ మంత్రి బాలినేని రాకను వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల బాలినేనికి జనసేన డీలిమిటేషన్ కమిటీ లో చోటు ఇచ్చారు. అధినేత ఆదేశాల మేరకు రాయలసీమతో పాటు ఒంగోలు, నెల్లూరు జిల్లా నేతలతో సమావేశం అయ్యారు బాలినేని. అక్కడ ఓ నేత బాహాటంగానే విమర్శలు చేశారు బాలినేని పై. దీనిపై తాజాగా స్పందించిన పవన్ సదరు నేతపై వేటు వేశారు. అంతటితో ఆగకుండా ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గాన్ని రద్దు చేశారు. నియోజకవర్గ ఇన్చార్జి లతోపాటు వివిధ విభాగాల ప్రతినిధులను సైతం పదవుల నుంచి తొలగించారు. కొత్త కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా మాజీ మంత్రి బాలినేనికి కీలక బాధ్యతలు కట్టబెట్టనున్నట్లు సంకేతాలు పంపారు.ఇటీవల బాలినేని విషయంలో వైఖరి మారుతోంది పవన్ కళ్యాణ్ కు. మొన్ననే ఆయన సీఎం చంద్రబాబును సైతం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బాలినేని రాకను టిడిపి ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నారు. అదే సమయంలో జనసేన క్యాడర్ సైతం వ్యతిరేకిస్తోంది. ఒంగోలు కార్పొరేషన్ నుంచి 26 మంది కార్పొరేటర్ లను జనసేనలో చేర్పించారు బాలినేని. అయినా సరే జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రియాజ్ సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. వాస్తవానికి బాలినేని వైసీపీ నుంచి రావడంతో ఆయనపై అనుమానపు చూపులు ఉండేవి. పని జిల్లా జనసేన నేతలు వైఖరి చూస్తుంటే వారి వెనుక వైసిపి ఉన్నట్టు అర్థం అవుతుంది. కేవలం బాలినేని అడ్డుకోవాలని రీతిలో వైసిపి నాయకత్వం స్థానిక జనసేన నేతలతో ఇలా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. పవన్ కళ్యాణ్ వరకు వెళ్లడంతో ఆయన కమిటీలన్నింటినీ రద్దు చేశారు. ఇకనుంచి బాలినేనికి జిల్లా బాధ్యతలు కట్టబెట్టే అవకాశం ఉంది. టిడిపి పరంగా కూడా బాలినేనిపై ఇకనుంచి అభ్యంతరాలు రాకపోవచ్చు. ఎందుకంటే బాలినేని ఒంగోలు విడిచి దర్శి వైపు అడుగులు వేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. మొత్తానికైతే పరిస్థితులు చూస్తుంటే మాజీ మంత్రి బాలినేనికి అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## ఎండలకు మాడిపోతున్న కోళ్లు...

**ఏలూరు, మే 27, పెన్ పవర్:** ఏపీలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకుతోడు వేడిగాలులతో ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు వచ్చేందుకు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు పౌల్ట్రీ ఫారాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఉన్నట్లుండి కుప్పకూలిపోయి చనిపోతుండటంతో పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్ర సంక్షోభం ఏర్పడింది.ఏపీ తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్లోనే అత్యధికమని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే, వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు రావొద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి.ఏపీలో భారీగా పెరుగుతున్న ఎండల తీవ్రత, వడగాలులు కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వేసవి వేడి తట్టుకోలేక గత కొన్ని రోజుల్లో లక్షలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఆదివారం ఒక్కరోజు రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షల కోళ్లు మృత్యువాత పడటం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు లక్షలకుపైగా కోళు మరణించాయి. దీంతో కోడి గుడ్ల ఉత్పత్తి భారీగా పడిపోయింది.రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా గడిచిన వారంరోజుల్లో దాదాపు 18 నుంచి 20 లక్షల కోళ్లు చనిపోయినట్లు పౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. విపరీతమైన వేడి వల్ల బతికున్న కోళ్లు కూడా సరిగా మేత తినడం లేదని పౌల్ట్రీ రైతులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 నుండి 48 డిగ్రీల వరకు నమోదు కావడమే ఈ దారుణ పరిస్థితికి ప్రధాన కారణంగా పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎండలు బర్డ్‌ఫ్లూ వైరస్ కంటే తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయని పౌల్ట్రీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# పైన కాదు కిందకు చూడు... ఏపీ పాలిటిక్స్ లో బిగ్ చేంజ్ !



రాజకీయం అంటే టాప్ లెవెల్ లో సాగేది. అంతా అంతపురం రహస్యాల మాదిరిగా ఉండేది. కోటలూ కోటరీలు అగ్ర నాయకుల మంతనాలు అక్కడే నిర్ణయాలు వాటిని అమలు చేయమని పై నుంచి దిగువ దాకా ఆదేశాలు. దాంతో రాజకీయం రక్తి కట్టేది. అంతా బాగానే సాగిపోయేది. రాజకీయ అధినాయకత్వాలు సైతం తమ చుట్టూ నలుగురుని ఉంచుకుని వారితోనే పార్టీ అంతా అనుకుంటూ పోతే అది ఇంకా బాగుండేది. కానీ కాలం మారుతోంది. అభిప్రాయాలు కూడా మారుతున్నాయి. రాజకీయం అంటే పైన కాదు కిందకు చూడు అంటోంది లేకపోతే పునాదులు సైతం కూలి మొత్తం రాజకీయమే కుప్ప కూలుతుందని కూడా హెచ్చరిస్తున్నారు. అలాంటి ఉదంతాలు ఉదాహరణ ఏపీలోనూ దేశంలోనూ చాలా చోట్ల జరిగాయి. ఆ బాధిత రాజకీయాన్ని చూసి అంతా ఇపుడు సర్దుకుంటున్నారు.

**కార్యకర్తే జీవగర్ర :**
ఏ రాజకీయ పార్టీకి అయినా కార్యకర్తలే ముఖ్యం. వారే జీవ గర్ర. ఒక విధంగా చెప్పాలీ అంటే రాజకీయ పార్టీ అనే భవనానికి పునాదులు పైన ఎక్కడో లేవు. అవి భూతలం మీదనే ఉన్నాయి. గ్రౌండ్ లెవెల్ లోనే ఉన్నాయి. అక్కడ కనుక పటిష్టంగా లేకపోతే ఎంతటి భవనం అయినా కుప్ప కూలుతుంది. ఇది అవగతం అయిన రాజకీయ పార్టీలు ఇపుడు అంతా కిందకే చూస్తున్నాయి. క్షేత్ర స్థాయికే ప్రాధాన్యత ఇస్తున్నాయి. కార్యకర్తే మాకు కావాలి అని నినాదాలు ఇస్తున్నాయి. ఏపీలో తెలుగుదేశం వైసీపీ జనసేన పార్టీలలో ఇపుడు కార్యకర్తలకే అధిక ప్రాధాన్యత దక్కుతోంది.

**సగటు నేతకు పొలిట్ బ్యూరో :**
తెలుగుదేశం పార్టీలో సగటు కార్యకర్తలకు పొలిట్ బ్యూరో వంటి అత్యున్నత విధాయక మండలిలో చోటు కల్పించి తెలుగుదేశం తానేంటో నిరూపించుకుంది. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకే పెద్ద పీట అని మాటలకే చెప్పడం కాదు చేతలలోనూ నిరూపించుకుంది. పార్టీలో కీలక పదవులు వారికే దక్కుతున్నాయి. నామినేటెడ్ పదవులు వారికే ఇస్తున్నారు. అంతే కాదు మంత్రుల దాకా కొత్త వారికి చాన్స్ ఇస్తూ టీడీపీలో ఒక కొత్త విప్లవానికి నాంది పలికింది. రానున్న కాలంలో కొత్త నాయకత్వం రావాలన్న పార్టీకి విజయాలు దక్కాలన్నా కూడా క్యాడర్ నుంచే అన్నది టీడీపీ అర్ధం చేసుకున్నంతగా ఎవరూ అర్ధం చేసుకోలేదు అని చెప్పాల్సిందే.

**వైసీపీ మేలుకుంటోంది :**
ఇక వైసీపీ విషయం తీసుకుంటే ఆ పార్టీ కూడా మేలుకుంటోంది. 2024 ఎన్నికల్లో కార్యకర్తలు పార్టీని పట్టించుకోవ్వడం వల్ల ఎంతటి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందో వైసీపీ కంటే ఎవరికీ ఎక్కువగా తెలియదు అని చెప్పాలి. అందుకే వైసీపీ ఎన్నికల అనంతరం కార్యకర్తల జపం చేస్తోంది. వైసీపీ 2.0లో కార్యకర్తలకే పెద్ద పీట అని అధినాయకత్వం పదే పదే చెప్పడం వెనక కూడా ఈ మూల సూత్రమే దాగి ఉంది. అధినాయకుడికి ఎంతటి ఇమేజ్ ఉన్నా గ్రౌండ్ లో పనిచేసేది క్యాడర్ మాత్రమే అని వారికి అసంతృప్తి కలిగి అలిగి దూరం వెళ్తే పార్టీ పుట్టె మునుగుతుందని అనుభవం పూర్వకంగా తెలుసుకున్న వైసీపీ దిద్దుబాటు చర్యలకు దిగుతోంది. అందులో భాగమే బూత్ లెవెల్ దాకా కమిటీలు వేయడంతో పాటు పనిమంతులకు పార్టీలో కీలక స్థానాలు కల్పిస్తమని చెబుతోంది. అలా వైసీపీ బూత్ లెవెల్ కార్యకర్తలే మార్గదర్శకులు అంటోంది.

**సాధకులతో సేన :**
ఇక ఏపీలో మరో కీలక పార్టీ జనసేన సాధకులతో పార్టీని కొత్త పుంతలు తొక్కిస్తోంది. ఉద్యమి సాధక్ అంటూ జనసేన కొత్త అంగాలను నిర్మించింది. వీరంతా కూడా గ్రౌండ్ లెవెల్ నుంచి వచ్చిన వారే కారణం. అధినేత పవన్ సైతం సాధకులే పార్టీకి వెన్నెముక అని స్పష్టంగా చెప్పారు. వారి సేవలను పార్టీ వినియోగించుకుంటుంది అని కూడా భరోసా ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే సాధకులకు గుర్తింపు కచ్చితంగా ఉండేలా జనసేనలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. మొత్తం మీద చూస్తే రాజకీయం మారుతోంది. పక్క ఉన్న అగ్ర నేతలను చూసి ధీమా పడే రోజులు పోయాయి. వారే పార్టీ అనుకుని నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటే బొక్క బోర్లా పడతామన్నది కూడా పార్టీలకు అర్ధం అయింది. దాంతో కష్టించి పనిచేసే కార్యకర్తలకు ఇపుడు మంచి రోజులు వస్తున్నాయని అంటున్నారు. అంతే కాదు వీరి నుంచి రాబోయే కాలానికి కాబోయే నాయకులు పుట్టుకుని వస్తారని కూడా చెబుతున్నారు.

# దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో ఎన్ని దేవాలయాలు ఉన్నాయో తెలుసా? మొదటి స్థానం ఆ రాష్ట్రానికే!



భారతదేశం అంటేనే పండగలు, భక్తి, సాంప్రదాయాలకు నిలయం. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన మన సంస్కృతిలో గుడులు, గోపురాలకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే మన దేశంలో ఏ రాష్ట్రంలో ఎక్కువ దేవాలయాలు ఉన్నాయో మీకు తెలుసా? తాజాగా బయటకు వచ్చిన లెక్కలు చూస్తే ఎవరైనా సరే షాక్ అవ్వాల్సిందే. వేల సంఖ్యలో ఆలయాలతో భక్తి సాగరంలో మునిగితేలుతున్న ఆ టాప్ రాష్ట్రాల ముచ్చట్లు, అక్కడి ఆధ్యాత్మిక విశేషాలు తెలుసుకుందాం..

**నంబర్ వన్ స్థానంలో తమిళనాడు:**
దేవాలయాల సంఖ్యలో తమిళనాడు రాష్ట్రం ఏకంగా 79,154 ఆలయాలతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఇక ఇక్కడి ఆకాశాన్ని తాకే పెద్ద పెద్ద గోపురాలు, అద్భుతమైన శిల్పకళ ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. మధురై మీనాక్షి అమ్మవారి ఆలయం, తంజావూరు బృహదీశ్వరాలయం, రామేశ్వరం లాంటి పుణ్యక్షేత్రాలు ఈ భక్తి గడ్డపైనే ఉన్నాయి.

**గట్టి పోటీ ఇస్తున్న మహారాష్ట్ర:**
తమిళనాడుకు గట్టి పోటీ ఇస్తూ మహారాష్ట్ర 77,238 ఆలయాలతో రెండో స్థానంలో నిలిచింది. ఆధ్యాత్మికతకు నిలయమైన ఈ రాష్ట్రంలో ప్రసిద్ధ జ్యోతిర్లింగాలు, శిరిడీ సాయిబాబా ఆలయం, ముంబై సిద్ధివినాయక గుడి, పండరీపురం విఠల మందిరం లాంటి ఎన్నో శతాబ్దాల నాటి ప్రాచీన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి.

**మూడో స్థానంలో కర్ణాటక:**
మన పొరుగు రాష్ట్రమైన కర్ణాటక 61,232 దేవాలయాలతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. హంపిలోని విరూపాక్ష ఆలయం, మైసూరు చాముండేశ్వరి గుడి, ఉడుపి శ్రీకృష్ణ మఠం లాంటి చారిత్రాత్మక కట్టడాలు ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడి శిల్పకళను చూడటానికి ప్రపంచం నలుమూలల నుండి టూరిస్టులు వస్తుంటారు.

**నాలుగో స్థానంలో పశ్చిమ బెంగాల్:**
దాదాపు 53,658 ఆలయాలతో పశ్చిమ బెంగాల్ నాలుగో స్థానంలో నిలిచింది. ముఖ్యంగా శక్తి పీఠాలకు, కాళీ మాత ఆరాధనకు ఈ రాష్ట్రం ఎంతో ఫేమస్. ఇక కోల్‌కతాలోని దక్షిణేశ్వర్ కాళీ ఆలయం, బేలూరు మఠం ఇక్కడ ఎంతో ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక కేంద్రాలు.

**కేవలం పూజలే కాదు.. అంతకు మించి:**
మన దేశంలో దేవాలయాలు అంటే కేవలం దండం పెట్టుకునే స్థలాలు మాత్రమే కాదు. అవి మన చరిత్రను, సంస్కృతిని, సాంప్రదాయ సంగీతాన్ని, శిల్పకళను తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న జీవన గమ్యాలు. ఇక గుడిలో మోగే ప్రతి గంట వెనుక వందల ఏళ్ల నాటి భక్తి భావం దాగి ఉంది.
భారతదేశంలోని ప్రతి అణువులోనూ భక్తిభావం నిండి ఉందనడానికి ఈ ఆలయాల సంఖ్యే ఒక నిదర్శనం. ఆధునిక కాలంలో ఎన్ని మార్పులు వచ్చినా, మన పూర్వీకులు అందించిన ఈ ఆధ్యాత్మిక వారసత్వాన్ని, అద్భుతమైన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది.

# ఉద్యోగులకు షాక్.. రూ.3.25 కోట్ల బోనస్ ఇచ్చిన కంపెనీ!




ప్రస్తుతం ఈరోజుల్లో ప్రైవేట్ ఉద్యోగాల్లో ఉన్న వారికి ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఎప్పుడు లేఆఫ్స్ ఉంటాయో, ఎప్పుడు జీతాలు కోత పడతాయోనని ఉద్యోగులు తెగ టెన్షన్ పడుతున్నారు. ఇలాంటి గందరగోళం మధ్య ప్రముఖ టెక్ దిగ్గజం శామ్‌సంగ్ తన ఉద్యోగులకు మైండ్ బ్లాక్ అయ్యే రేంజ్ లో ఒక క్రేజీ గుడ్ న్యూస్ చెప్పింది. ఎవరూ ఊహించని విధంగా భారీ బోనస్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ విశేషాలు చూద్దాం.

**శామ్‌సంగ్ ఉద్యోగులకు బంపర్ ఆఫర్:**
ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద కంపెనీలు ఉద్యోగులను తీసేస్తున్న తరుణంలో శామ్‌సంగ్ మాత్రం తన చిప్ విభాగంలో పనిచేసే ఉద్యోగులకు భారీ జాక్‌పాట్ ఇచ్చింది. ఇక అక్కడ పనిచేసే ప్రతి ఒక్క ఉద్యోగికి సగటున ఏకంగా రూ. 3.25 కోట్ల బోనస్ ప్రకటించింది. ఈ వార్త విన్నప్పటి నుంచి సాఫ్ట్‌వేర్ గ్రూపుల్లో “జాబ్ చేస్తే ఇలాంటి కంపెనీలోనే చేయాలి బాసూ” అని తెగ చర్చించుకుంటున్నారు.

**లాభాలు కురిపించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ :**
ఇక ఇంతకీ శామ్‌సంగ్‌కు అంత లాభాలు ఎలా వచ్చాయంటే.. ఇప్పుడు ఎక్కడ చూసినా ఏఐ విప్లవం నడుస్తోంది. ఇక దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. ఫలితంగా శామ్‌సంగ్ తయారు చేసే మెమరీ చిప్స్‌కు విపరీతమైన గిరాకీ వచ్చింది. ఇక గత త్రైమాసికంలో ఈ కంపెనీ చిప్ డివిజన్ ఆదాయం ఏకంగా 49 రెట్లు పెరగడం విశేషం.

**18 రోజుల సమ్మె వెనుక అసలు కథ:**
ఈ భారీ బోనస్ వెనుక మరో ఆసక్తికరమైన కథ కూడా ఉంది. ఇటీవల జీతాల పెంపు, బోనస్ ఇవ్వాలంటూ ఈ చిప్ విభాగంలోని ఉద్యోగులు దాదాపు 18 రోజుల పాటు సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఇక సెమీకండక్టర్ తయారీలో ఒక్క రోజు పని ఆగినా కంపెనీకి కోట్లల్లో నష్టం వస్తుంది. అందుకే యాజమాన్యం వెనక్కి తగ్గి, ఉద్యోగుల సంఘంతో చర్చలు జరిపి ఈ భారీ ప్యాకేజీకి ఓకే చెప్పింది.

**78,000 మందికి జాక్‌పాట్:**
కంపెనీ తీసుకున్న ఈ నిర్ణయంతో దాదాపు 78,000 మంది ఉద్యోగుల అకౌంట్లలోకి ఈ భారీ బోనస్ డబ్బులు చేరనున్నాయి. ఇక కేవలం శామ్‌సంగ్ మాత్రమే కాదు.. గత ఏడాది దీనికి పోటీ సంస్థ అయిన ‘ఎస్కే హైనిక్స్’ కూడా తమ ఉద్యోగులకు ఇలాగే భారీ బోనస్‌లు ఇచ్చింది. ప్రస్తుతం ఏఐ పుణ్యమా అని దక్షిణ కొరియా చిప్ కంపెనీలు లాభాల బాటలో పయనిస్తున్నాయి. కష్టపడి పని చేసే ఉద్యోగులను ఆదరిస్తే కంపెనీలు ఎలా ఎదుగుతాయో చెప్పడానికి శామ్‌సంగ్ నిర్ణయమే ఒక ఉదాహరణ. ఉద్యోగ భద్రత లేక ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో, తమ లాభాలను ఉద్యోగులతో పంచుకున్న శామ్‌సంగ్ నిజంగా గ్రేట్ అనిపించుకుంది.

# కాక్రోచ్ టు కార్పొరేట్ మజ్దూర్.. సోషల్ మీడియాను షేక్ చేస్తున్న డిజిటల్ పార్టీలు




ఇప్పుడు సంభాషణలు, ఆందోళనలు, హాస్యం.. అన్నీ డిజిటలైజ్ అయ్యాయి. ఒకప్పుడు రాజకీయ పార్టీలంటే జెండాలు, మైకులు, రోడ్ షోలు గుర్తొచ్చేవి. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. అంతా డిజిటల్ మయం. మన బాధలు, ఆందోళనలు, ఆఫీస్ ఫ్రస్ట్రేషన్లు వంటివి అన్నీ మీమ్స్ రూపంలోకి మారిపోయాయి. ఇంటర్నెట్‌లో కొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్న కాక్రోచ్ పార్టీ మరికొందరికి ప్రేరణగా మారిపోయింది. నిరుద్యోగ యువతను కాక్రోచ్ పార్టీ విపరీతంగా ఆకర్షించగా, కార్పొరేట్ ఉద్యోగాలు చేస్తున్న యువత తమకు కూడా అలాంటి పార్టీ ఒకటి ఉంటే బాగుణ్ణు అని భావించారేమో.. కార్పొరేట్ ఉద్యోగుల గుండె చప్పుడుగా చెబుతూ నెట్టింట ‘కార్పొరేట్ మజ్దూర్ జనతా పార్టీ’ (Corporate Majdoor Janta Party - CMJP) పేరుతో సరికొత్త వేదికను ప్రారంభించారు.
లింక్డ్ఇన్ లో ఒక సాధారణ వ్యంగ్య పోస్ట్‌గా మొదలైన ఈ వ్యవహారం.. ఇప్పుడు కార్పొరేట్ ఉద్యోగుల అలసట, పని ఒత్తిడి, కార్యాలయ సంస్కృతిపై ఉన్న అసంతృప్తిని హాస్య రూపంలో బయట పెడుతోంది. ఈ పేజీలో పోస్టులు విశేషంగా వైరల్ అవుతూ సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి. ఆశ్చర్యకరంగా దీనికోసం ఒక వెబ్‌సైట్ కూడా పుట్టుకొచ్చింది. అందులో ‘జాయిన్ ద మూమెంట్’ అంటూ పిలుపునిస్తుండటం విశేషంగా చెబుతున్నారు. ఇది పెరుగుతున్న డిజిటలైజేషన్‌కు అసలైన అద్దం పడుతోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**కార్పొరేట్ మజ్దూర్ జనతా పార్టీ డిమాండ్లు ఇవేనట!**
ప్రముఖ కమెడియన్ అన్మోల్ గర్గ్ కూడా ఇదే థీమ్‌పై వీడియోలు చేస్తూ ఈ ట్రెండ్‌కు మరింత హైప్ తీసుకొచ్చారు. కార్పొరేట్ ఉద్యోగులు రోజువారీ లైఫ్‌లో ఎదుర్కొనే లేఆఫ్‌లు, వేధింపులు, తక్కువ హైక్‌లు, టాక్సిక్ వర్క్ కల్చర్‌పై నిరసనగా ఈ క్యాంపెయిన్ సాగుతోంది. ఈ ‘కార్పొరేట్ జనతా పార్టీ’ మేనిఫెస్టోలో కొన్ని క్రేజీ డిమాండ్లు కూడా ఉన్నాయి. సడన్‌గా ఉద్యోగం నుంచి తీసేస్తే కంపెనీలు భద్రత కల్పించాలనేది ప్రధాన డిమాండ్ కాగా, ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ కంపెనీల్లో పనిచేసుకునే స్వేచ్ఛ కల్పించాలని కోరడం విశేషం. అదేవిధంగా ఆఫీస్ వేళలు అయిపోయాక క్విక్ కాల్స్, మేనేజర్ల మెయిల్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. ఇక యథావిధిగా జీతాల పెంపుపైనా ఒక లైన్ యాడ్ చేశారు.

**వర్క్‌ఫోర్స్ ఉద్యమంగా..**
ఇక కార్పొరేట్ మజ్దూర్ పార్టీని కొందరు కేవలం టైమ్‌పాస్ మీమ్ పేజీలా కాకుండా, ప్రైవేట్ రంగ ఉద్యోగుల హక్కుల కోసం ఏర్పాటయిన ఒక డిజిటల్ సైన్యంగా అభివర్ణిస్తున్నారు. కొన్ని ప్లాట్‌ఫారమ్‌లలో ఈ ఖాతాలను బ్యాన్ చేసినప్పటికీ, నెటిజన్లు, కార్పొరేట్ ‘మజ్దూర్లు’ అందిస్తున్న సంఘీభావంతో ఈ డిజిటల్ విప్లవం మరింత చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా, ఆఫీసులో బాస్ ఇచ్చే ప్రెజర్‌ను తట్టుకోవడానికి, లాప్‌టాప్ ముందు కూర్చుని విసిగిపోయిన ఐటీ బాబులకు ఈ ‘కార్పొరేట్ మజ్దూర్ జనతా పార్టీ’ మీమ్స్ ఒక పెద్ద రిలాక్సేషన్ అని అంటున్నారు.

# టైం, ప్లేసు చెబితే అక్కడికే వస్తా.. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఓపెన్ ఛాలెంజ్!



ఏపీ ప్రభుత్వం, ప్రొఫెసర్ నాగేశ్వర్ మధ్య వివాదం ముదురుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలకు నిరసనగా, జనసేన కార్యకర్తలు పోలీసు కేసులు పెట్టడం, వాటి ఆధారంగా ప్రొఫెసర్ పై పలు పోలీసుస్టేషన్లలో ఎఫ్ఐఆర్ లు నమోదు చేయడంపై తెలంగాణ మేథావులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ కు మద్దతుగా బుధవారం హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రొఫెసర్ నాగేశ్వర్ తోపాటు పలువురు జర్నలిస్టులు, సామాజిక ఉద్యమకారులు పాల్గొన్నారు.
ప్రొఫెసర్ నాగేశ్వర్ తన మాటలను ఉపసంహరించుకున్నా, ఆయనపై ఎఫ్ఐఆర్ లను ఉపసంహరించుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడాన్ని రౌండ్ టేబుల్ సమావేశంలో తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రానికి ఏపీ పోలీసులు వచ్చి, ప్రొఫెసర్ ను ఎలా అరెస్టు చేస్తారో చూస్తామంటూ పలువురు మేథావులు సవాల్ విసిరారు. తెలంగాణ మేథావులను పాత్రికేయులను తొక్కుతామంటే సహించేది లేదని బక్క జాన్సన్ తేల్చిచెప్పారు. నాగేశ్వర్ పై తుపాకి పెట్టి మమ్మల్ని కాల్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణకు వచ్చే ఏపీ పోలీసులను అరెస్టు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ కు తెలంగాణ కోసం మాట్లాడే అర్హతే లేదన్నారు. ఆయనను ఉప ముఖ్యమంత్రిగా చేయడమే తప్పు అంటూ యాదగిరి వ్యాఖ్యానించారు. నాగేశ్వర్ ను అరెస్టు చేసే అర్హత లేదన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ చాలా సంస్కారవంతంగా మాట్లాడతారని కితాబునిచ్చారు. రాజ్యాంగం తమకు మాట్లాడే స్వేచ్ఛనిచ్చిందన్నారు. చేగువేరా బొమ్మలు పట్టుకుని గద్దర్ ను మోసం చేశావని, రోజుకొక పార్టీ మారుస్తావంటూ యాదగిరి ఫైర్ అయ్యారు.
ఇక ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ, కష్టకాలంలో తనకు అండగా నిలిచిన తెలంగాణ జర్నలిస్టులు, మేథావులు, సామాజిక కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన తాను 30 ఏళ్ల వయసులోనే అరెస్టులకు భయపడలేదని, ఇప్పుడు తనకు 62 వయసు అని ఇప్పుడు భయపడతానా? అంటూ ప్రశ్నించారు. తన ఇంటికి ఏపీ పోలీసులు వచ్చారని కొన్ని పత్రికలు రాస్తున్నాయని అందులో ఎటువంటి నిజం లేదన్నారు. తనకు తెలంగాణ ప్రభుత్వం భద్రత కల్పించిందని వెల్లడించారు.తనను అరెస్టు చేయడానికి ఏపీ పోలీసులు రారని తాను చెప్పనని నాగేశ్వర్ వ్యాఖ్యానించారు. ఏపీ పోలీసులు హైదరాబాద్ కు వచ్చి ఉంటారని, కానీ తన ఇంటికి మాత్రం రాలేదని స్పష్టం చేశారు. తనపై నమోదు చేసిన కేసులు, సెక్షన్లు నవ్వు తెప్పిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వమే నేరుగా కేసులు పెట్టిందని ఆక్షేపించారు. కుల చిచ్చు పెట్టిందని కేసులు నమోదు చేశారని తన వ్యాఖ్యల్లో ఎక్కడా కులాల ప్రస్తావన లేదని తేల్చిచెప్పారు. ప్రాంతం అడ్డు పెట్టుకున్నారని పవన్ ఆరోపించారని, తాను ఎక్కడా ప్రాంతం అన్న వ్యాఖ్యలు చేయలేదని నాగేశ్వర్ స్పష్టం చేశారు. ఆ రెండు పార్టీల వారే ప్రాంతాల ప్రస్తావన తీసుకువచ్చారని ఆక్షేపించారు. నువ్వు తెలంగాణ వాడివి ఆంధ్రా రాజకీయాలతో నీకేం పని అంటూ ప్రశ్నిస్తున్నారని, తాను అమెరికా, ఇరాన్ కోసం కూడా మాట్లాడతానన్నారు. మాట్లాడొద్దని చెప్పడం ఎక్కడి సిద్ధాంతమో చెప్పాలని డిమాండ్ చేశారు. “తెలంగాణ వాడిని అని మాట్లాడొద్దంటే ఎలా? కులం చిచ్చు పెట్టానని కేసు పెట్టారు, నోటీస్ ఇవ్వకుండా అరెస్టు చేసేలా అల్లర్లు సృష్టించానని కేసులు పెట్టారు. ప్రజా జీవితాన్ని అల్లకల్లోలం పెట్టానని మరో కేసు పెట్టారు. ఈ కేసులను చూస్తే ఆయా సెక్షన్లు వ్యాఖ్యలు, ప్రకటనలకు వర్తించవని ఉందని తెలిపారు. తాను మాట్లాడటం వల్ల ఎవరికి నష్టం జరిగిందని నాగేశ్వర్ ప్రశ్నించారు.కనీసం రెండు దోమలు కూడా ఎవరిని చంపలేదు, నాలుగు ఈగలైనా చంపలేదు.. రెండు కుక్కలు అయినా కొట్లాడుకున్నాయా?” అంటూ నాగేశ్వర్ ప్రశ్నించారు. తనపై నమోదు చేసిన కేసులు చూస్తే నవ్వొస్తోందన్నారు. చివరగా, చావనైనా చస్తాను కానీ మాట్లాడటం మాననని తేల్చిచెప్పారు. మీరు అరెస్టు చేసుకుంటారా? కేసులు ఉపసంహరించుకుంటారా? అనేది మీ ఇష్టం కానీ నేను మాట్లాడుతూనే ఉంటానని తేల్చిచెప్పారు. అరెస్టుకు తాను సిద్ధంగా ఉన్నానని టైం, ప్లేసు చెబితే అక్కడికే వస్తానంటూ ముగించారు.

# E20 పెట్రోల్‌తో దారుణంగా పడిపోయిన మైలేజ్.. రిపేర్స్‌తో లబోదిబో అంటున్న ఓనర్స్




దేశవ్యాప్తంగా కాలుష్యాన్ని తగ్గించడానికి.. అంతకంటే మరీ ముఖ్యంగా ముడి చమురు దిగుమతులను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఙు20 పెట్రోల్ ప్రస్తుతం పాత వాహనదారుల పాలిట శాపంగా మారుతోంది. 2022 కంటే ముందు కొన్న టూవీలర్లు, ఫోర్‌వీలర్ల యజమానుల్లో దాదాపు సగం మంది E20 పెట్రోల్ వాడకం వల్ల తమ వాహనాల మైలేజ్ దారుణంగా పడిపోయిందని వాపోతున్నారు. 'లోకల్‌సర్కిల్స్' దేశవ్యాప్తంగా నిర్వహించిన తాజా సర్వేలో ఈ షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్ కంపెనీలన్నీ తప్పనిసరిగా 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ ఉన్న ఇంధనాన్ని మాత్రమే విక్రయిస్తుండటంతో వాహనదారులు వేరే దారి లేక దీన్నే వాడుతున్నారు. అయితే అధికారిక అంచనాల ప్రకారం ఈ20 పెట్రోల్ వల్ల మైలేజ్ కేవలం 1 నుండి 6 శాతం మాత్రమే తగ్గుతుందని చెప్పినప్పటికీ.. క్షేత్రస్థాయిలో వాహనదారుల వాస్తవ అనుభవం మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. సర్వేలో పాల్గొన్న ప్రతి ఇద్దరిలో ఒకరు మైలేజ్ భారీగా తగ్గిందని చెప్పారు. అందులోనూ 25 శాతం మంది తమ వాహనాల మైలేజ్ ఏకంగా 20 శాతం కంటే ఎక్కువ పడిపోయిందని, మరో 20 శాతం మంది 10 నుండి 20 శాతం వరకు మైలేజ్ తగ్గిందని చెప్పుకొచ్చారు.

మైలేజ్ తగ్గడం ఒక ఎత్తయితే.. వాహనాల ఇంజన్లు దెబ్బతినడం మరో ఎత్తు. దాదాపు 29 శాతం మంది వాహనదారులు తమ బండ్లకు తరచూ రిపేర్లకు వస్తున్నాయని.. ఇంజన్, ఫ్యూయల్ లైన్, ట్యాంక్ లేదా కార్బ్యురేటర్లలో వింత మార్పులు గమనించామని చెప్తున్నారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్ సాధారణ పెట్రోల్ కంటే త్వరగా తేమను ఆకర్షిస్తుంది. దీనివల్ల పాత వాహనాల్లోని రబ్బర్, ప్లాస్టిక్ భాగాలు, సీల్స్, గ్యాస్కెట్లు త్వరగా పాడైపోతున్నాయి. బండి ఇంజన్ త్వరగా వేడెక్కడం, వైబ్రేషన్స్ రావడం, ఉదయం పూట స్టార్ట్ అవ్వడానికి ఇబ్బంది పెట్టడం, పికప్ దారుణంగా పడిపోవటం లాంటి సమస్యలను టూవీలర్ల యజమానులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారట. నిజానికి గత 15 ఏళ్లలో అమ్ముడైన వాహనాల్లో దాదాపు 80 శాతం కేవలం ఙు5, ఙు10 పెట్రోల్‌కు మాత్రమే తగినట్లుగా డిజైన్ చేయబడ్డాయి. ఇప్పుడు అకస్మాత్తుగా ఙు20 ఫ్యూయల్ వాడటం వల్ల వాటిపై తీవ్ర ప్రభావం పడుతోంది. పాత బండ్లు ఉన్న సాధారణ ప్రజలకు తక్కువ ఇథనాల్ ఉన్న ప్రీమియం పెట్రోల్ కొందామన్నా.. దాని ధరలు సామాన్యుడికి అందుబాటులో లేవు. ఒకవైపు ఙు20 పెట్రోల్‌తోనే వాహనదారులు ఇలా సగం చస్తుంటే.. ప్రభుత్వం మాత్రం రాబోయే రోజుల్లో ఇథనాల్ శాతాన్ని మరింత పెంచి ఙు22, E25, E30 పెట్రోల్ తీసుకురావడానికి సిద్ధమవడం వాహనదారులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

## క్రెడిట్ కార్డ్‌తో ఏటీఎం నుంచి డబ్బులు తీస్తున్నారా? అయితే మీరు పెద్ద ఊబిలో పడ్డట్లే జాగ్రత్త




ఈ రోజుల్లో క్రెడిట్ కార్డుల వాడకం విపరీతంగా పెరిగింది. షాపింగ్ మాల్స్‌లో స్వైప్ చేయడానికో, ఆన్‌లైన్ పేమెంట్స్ కో వీటిని ఎక్కువగా వాడుతుంటారు. అయితే చాలా మంది అత్యవసర సమయాల్లో డబ్బులు అవసరం అయినప్పుడు ఒక పెద్ద తప్పు చేస్తున్నారు. అదేంటంటే.. క్రెడిట్ కార్డును నేరుగా ఏటీఎం మిషన్‌లో పెట్టి క్యాష్ విత్‌డ్రా చేయడం. తెలియక చేసే ఈ చిన్న తప్పు మిమ్మల్ని కోలుకోలేని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తుంది తెలుసా.

సాధారణంగా క్రెడిట్ కార్డుతో షాపింగ్ చేసినప్పుడు బ్యాంకులు 45 నుండి 50 రోజుల వరకు ఎలాంటి వడ్డీ లేని కాలపరిమితిని అందిస్తాయి. కానీ ఏటీఎం నుండి నగదు విత్‌డ్రా చేసిన మరుక్షణమే ఈ గ్రేస్ పీరియడ్ సదుపాయం పూర్తిగా రద్దవుతుంది. అంటే మీరు డబ్బులు డ్రా చేసిన మొదటి రోజు నుంచే బ్యాంకులు వడ్డీని లెక్కించడం ప్రారంభిస్తాయి. క్రెడిట్ కార్డ్ క్యాష్ విత్‌డ్రా పై బ్యాంకులు వసూలు చేసే వడ్డీ రేట్లు, సాధారణ పర్సనల్ లోన్స్ కంటే ఊహించని స్థాయిలో చాలా ఎక్కువగా ఉంటాయి. బ్యాంకులు వార్షికంగా కనీసం 33% నుంచి 45% వరకు అత్యధిక వడ్డీని.. అది కూడా చక్రవడ్డీ రూపంలో వసూలు చేస్తాయి. దీనికి తోడు ప్రతి విత్‌డ్రాపై కనీసం రూ.250 నుండి రూ.500 వరకు లేదంటే విత్‌డ్రా చేసిన మొత్తంలో 2.5% నుండి 3% వరకు ఫీజు కట్ అవుతుంది. పైగా ఈ సేవలన్నింటిపై అదనంగా 18% +ూు కూడా పడుతుంది.కేవలం కొన్ని వేల రూపాయల అత్యవసరం కోసం క్రెడిట్ కార్డుపై ఆధారపడి ఏటీఎంలో చెయ్యి పెడితే.. వచ్చే నెలలో బిల్లు చూసేసరికి గుండె ఆగినంత పని అవుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. జేబు ఖాళీగా ఉందని చేసే ఈ పని, మిమ్మల్ని అప్పుల ఊబిలోకి లాగుతుందని మర్చిపోకండి. అందుకే ప్రాణాపాయ స్థితిలో మరే ఇతర మార్గం లేని అత్యంత అనివార్యమైన పరిస్థితుల్లో తప్ప.. క్రెడిట్ కార్డు ద్వారా ఏటీఎంల నుంచి డబ్బులు తీసే జోలికి అస్సలు వెళ్లకూడదని ఆర్థిక నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. క్రెడిట్ కార్డ్ అనేది డిజిటల్ లావాదేవీలకే కానీ.. డబ్బులు డ్రా చేసుకుని వాడుకోవటానికి మాత్రం కాదని గుర్తుంచోవాలని సూచిస్తున్నారు.

# వైరల్ స్టోరీ: ఒకే ఫ్యామిలీలో 6 ఉద్యోగాలు ఊడాయ్.. జాబ్ మార్కెట్ సంక్షోభానికి ఇది నిదర్శనమా?




ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ, ఫిన్‌టెక్, ఏవియేషన్ రంగాల్లో జరుగుతున్న లే-ఆఫ్‌లు ఏ స్థాయిలో ఉన్నాయో కళ్లకు గట్టే రియల్ స్టోరీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'రెడ్డిట్' వేదికగా వెలుగులోకి వచ్చింది. తమ కుటుంబం మొత్తం రోడ్డున పడిందని.. అందరం తీవ్ర భయాందోళనల్లో ఉన్నాం.. దయచేసి ఏదైనా సలహా ఇవ్వండి అంటూ ఒక నెటిజన్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. ఆ కుటుంబంలో ఉన్న తల్లిదండ్రులతో పాటు నలుగురు తోబుట్టువులు.. అంటే మొత్తం ఆరుగురు ఒకేసారి ఉద్యోగాలు కోల్పోయి తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారట.

ఏడాది క్రితం ఒకరు ఉద్యోగం కోల్పోగా.. మరొకరు ఇటీవల ఎటువంటి సెవెరెన్స్ ప్యాకేజీ లేకుండానే తొలగించబడ్డారు. ఇంకొకరు ఫిన్‌టెక్ కంపెనీలో, మరొకరు మూతపడిన ఒక విమానయాన సంస్థలో పనిచేస్తూ ఉపాధి కోల్పోయారు. కష్టపడి పైకొచ్చి, పెద్ద పెద్ద కంపెనీల్లో స్థిరపడ్డాం అనుకున్న తరుణంలో.. ఇలా అందరి ఉద్యోగాలు ఒకేసారి ఊడిపోతాయని తాము కలవకలో కూడా ఊహించలేదని ఆ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు.

**జాబ్ మార్కెట్ ఎంత దారుణంగా ఉందంటే?**

ఈ పోస్ట్ ద్వారా ప్రస్తుతం గ్లోబల్ జాబ్ మార్కెట్ ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లో ఉందో స్పష్టమవుతోంది. ఐటీ, టెక్ రంగాల్లో అనుభవం ఉన్నప్పటికీ.. నెలల తరబడి ప్రయత్నించినా ఎక్కడా కొత్త జాబ్స్ దొరకడం లేదు. కనీసం బతుకుదెరువు కోసం ఉబెర్ నడపడానికో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలోనో, రిటైల్ షాపుల్లోనో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేద్దామన్నా.. వాటి ద్వారా వచ్చే ఆదాయం భారీ హోమ్ లోన్ల ఈఎంఐలను కట్టడానికి ఏమాత్రం సరిపోవడం లేదంటోంది ఈ ఫ్యామిలీ. పెద్ద నగరాల్లో ఇళ్ల అద్దెలు కట్టలేక ఇద్దరు చిన్న తోబుట్టువులు తమ తల్లిదండ్రుల పల్లెటూరికి తిరిగి వెళ్లారు. అయితే అక్కడ వారి ఐటీ అనుభవానికి తగ్గ ఏ ఒక్క ఉద్యోగ అవకాశం లేదు. చివరికి స్థానికంగా ఉండే చిన్న చిన్న దుకాణాల్లో పని దొరకాలన్నా ఎవరిదో ఒకరి రికమండేషన్ ఉండాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు.

**ఇళ్లు అమ్మేసుకోవాలా?**

ప్రస్తుతం ఆ కుటుంబం ముందున్న పెద్ద సవాలు.. మూడు ఇళ్ల తాలూకు హోమ్ లోన్లను ఎలా మేనేజ్ చేయాలనేది. ఏ ఇల్లు ఉంచుకోవాలి, ఏ ఇల్లు వదిలేసుకోవాలి అనే సందిగ్ధంలో వారున్నారు వాళ్లు. ఈ పోస్ట్‌పై స్పందించిన అనేకమంది నెటిజన్లు, ఆర్థిక నిపుణులు తమ పాత ఆర్థిక సంక్షోభ అనుభవాలను పంచుకుంటూ కొన్ని కీలక సూచనలు చేశారు.

ఎమోషన్స్ కి పోయి అన్ని ఇళ్లను కాపాడుకోవాలని చూస్తే పూర్తిగా మునిగిపోతారు. కాబట్టి ఎక్కడైతే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయో ఆ నగరంలోని ఇల్లు ఒకదాన్ని ఉంచుకుని.. మిగిలిన ఇళ్లను అమ్మేయడం మంచిదని ఈ ఫ్యామిలీకి కొందరు నెటిజన్లు సూచిస్తున్నారు. అందరూ ఒకే ఇంట్లో ఉంటూ ఖర్చులను తగ్గించుకోవాలని చెబుతున్నారు. అలాగే పర్మనెంట్ జాబ్స్ దొరికే వరకు సూపర్ మార్కెట్లలో నైట్ షిఫ్టులు, లేబర్ పనులు అయినా చేస్తూ కొంత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సలహా ఇస్తున్నారు.

ఈ పరిస్థితి కేవలం ఒక కుటుంబానిది మాత్రమే కాదు. టెక్ రంగంలో ప్రవేశిస్తున్న ఏఐ, కంపెనీల రీస్ట్రక్చరింగ్ పద్ధతుల కారణంగా రాబోయే రోజుల్లో లే-ఆఫ్‌లు మరిన్ని రంగాలకు విస్తరిస్తాయనడానికి ఇదొక హెచ్చరిక లాంటిదని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు అత్యంత సేఫ్ జాబ్స్ అనుకున్న ఐటీ ఉద్యోగాలు కూడా ఇప్పుడు ఎంతటి అనిశ్చితిలో పడ్డాయో ఈ ఫ్యామిలీకి జరిగిన ఘటన కళ్లకు కడుతోంది.

## బ్యాంకింగ్ షేర్లు ఢీలా.. స్వల్ప నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

- ఒడుదొడుకుల మధ్య స్వల్ప నష్టాల్లో ముగిసిన మార్కెట్లు
- బలహీనపడిన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లు
- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో ఇన్వెస్టర్ల ఆందోళన
- 142 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- సూచీలు తగ్గినా లాభపడిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు



బుధవారం నాటి ట్రేడింగ్‌లో దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడుదొడుకుల మధ్య స్వల్ప నష్టాలతో ముగిశాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్లను ఆచితూచి అడుగులు వేసేలా చేశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, 30 షేర్ల సెన్సెక్స్ 141.90 పాయింట్లు నష్టపోయి 75,867.80 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ కూడా 6.55 పాయింట్ల స్వల్ప నష్టంతో 23,907.15 వద్ద ముగిసింది. అమెరికా, ఇరాన్ మధ్య సయోధ్యకు చర్చలు జరుగుతున్నప్పటికీ, మంగళవారం దక్షిణ ఇరాన్‌పై అమెరికా దాడులు చేసిందన్న వార్తలు అంతర్జాతీయంగా ఆందోళనలను పెంచాయి. ఈ పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అమ్మకాల వైపు మొగ్గు చూపడం కూడా ప్రతికూల ప్రభావం చూపింది. టెక్నికల్ పరంగా చూస్తే, నిఫ్టీకి 23,800 పాయింట్ల వద్ద కీలక మద్దతు ఉందని, ఒకవేళ ఈ స్థాయిని కోల్పోతే 23,600-23,500 స్థాయిల వరకు పతనం ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అదే సమయంలో, 24,000-24,100 శ్రేణి బలమైన నిరోధకంగా ఉందని, దీనిని దాటితేనే బుల్స్ తిరిగి పట్టు సాధించగలరని పేర్కొన్నారు. నిఫ్టీలో ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. మరోవైపు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, ఎన్టీపీసీ షేర్లు 2 శాతానికి పైగా లాభపడగా.. టాటా స్టీల్, ఇండిగో, మారుతీ సుజుకీ, టైటాన్ కంపెనీ, ఏషియన్ పెయింట్స్ కూడా లాభాలతో ముగిశాయి. సూచీలు బలహీనంగా ఉన్నప్పటికీ, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ రాణించడం విశేషం. రంగాలవారీగా చూస్తే ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్ సూచీలు నష్టపోగా, మీడియా, మెటల్, ఆటో సూచీలు లాభపడ్డాయి.

# 10 నిమిషాల డెలివరీ మ్యాజిక్: కిరాణా, ఈ-కామర్స్ దుకాణాలకు క్విక్ కామర్స్ షాక్






దేశంలో ఆన్‌లైన్ షాపింగ్ ట్రెండ్ ఊహించని వేగంతో దూసుకుపోతోంది. ఒకప్పుడు వస్తువులు ఆర్డర్ చేస్తే రోజులు, గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు కేవలం 10 నిమిషాల్లో డెలివరీ అంటూ బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు దేశంలోని దిగ్గజ ఖీవీజ+ కంపెనీల అమ్మకాలను శాసిస్తున్నాయి. డాబర్, బ్రిటానియా వంటి కంపెనీల మొత్తం ఆన్‌లైన్ విక్రయాల్లో ఏకంగా 75 శాతం వాటాను ఈ 10 నిమిషాల డెలివరీ యాప్స్ కైవసం చేసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఈ క్విక్ కామర్స్ తుఫాన్ దెబ్బకు సాంప్రదాయ ఈ-కామర్స్ సైట్లు, మోడరన్ రిటైల్ మాల్స్, చివరకు మన ఇంటి పక్కన ఉండే కిరాణా షాపుల అమ్మకాలు కూడా తగ్గాయి. వినియోగదారుల కొనుగోలు అలవాట్లను ఇది పూర్తిగా మార్చేస్తోంది. ఐటీసీ, టాటా కన్స్యూమర్, పార్లే ప్రొడక్ట్స్, ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ సంస్థలు 2026 ఆర్థిక సంవత్సరంలో వాటి మొత్తం ఆన్‌లైన్ అమ్మకాల్లో క్విక్ కామర్స్ వాటా 60% నుండి 75% కి పెరిగింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది భారీ వృద్ధి. అలాగే బ్రిటానియా, టాటా కన్స్యూమర్ ఆన్‌లైన్ సేల్స్‌లో క్విక్ కామర్స్ వాటా 70 శాతానికి పైగా ఉంది. ఇక డాబర్ విషయానకి వస్తే.. డిసెంబర్ త్రైమాసికంలో 50 శాతంగా ఉన్న ఈ వాటా.. మార్చితో ముగిసిన 4వ త్రైమాసికానికి ఏకంగా 75 శాతానికి చేరింది. అలాగే తమ డిజిటల్ అమ్మకాలలో 58 శాతం వాటాను ఈ ఛానెల్ నుంచే వస్తున్నట్లు ఐటీసీ ప్రకటించింది. వినియోగదారులు సౌకర్యానికి, తక్షణ అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకే బిగ్‌బాస్కెట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ కంపెనీలతో పాటు రిలయన్స్ రిటైల్ వంటి పెద్ద నెట్‌వర్క్‌లు కూడా ఇప్పుడు క్విక్ కామర్స్ రంగంలోకి దూకుతున్నాయని పార్లే ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ మయాంక్ షా అన్నారు. వారంలో ఎక్కువసార్లు చిన్న చిన్న వస్తువులను ఇన్‌స్టంట్‌గా ఆర్డర్ చేసే అలవాటు ప్రజల్లో విపరీతంగా పెరిగిపోవడమే దీనికి ప్రధాన కారణంగా వారు గుర్తించారు.

**ప్రీమియం వస్తువుల అమ్మకాలకు బూస్టింగ్..**

సాధారణ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో ఎక్కువగా నిత్యావసరాలు అమ్ముడవుతుంటే.. క్విక్ కామర్స్ యాప్స్‌లో మాత్రం ప్రీమియం, లగ్జరీ వస్తువులు విపరీతంగా అమ్ముడవుతున్నాయని బ్రిటానియా ఇండస్ట్రీస్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ విపిన్ కటారియా తెలిపారు. దీనివల్ల కంపెనీల అనుబంధ వస్తువుల విక్రయాలు 3 రెట్లు పెరిగాయి. భవిష్యత్తులో తమ ఆన్‌లైన్ అమ్మకాల్లో క్విక్ కామర్స్ వాటా 85 శాతానికి చేరుకుంటుందని అంచనా వేశారు.

**మెట్రో నగరాల నుండి చిన్న టౌన్ల వైపు..**

ప్రస్తుతం ఈ 10 నిమిషాల డెలివరీ ట్రెండ్ కేవలం టాప్ 8-10 మెట్రో నగరాలకే పరిమితం కాకుండా.. చిన్న పట్టణాలకు కూడా వేగంగా విస్తరిస్తోంది. ఎఫ్ఎమ్‌సీజీ రంగంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విభాగంగా ఇది నిలిచింది. బేవరేజెస్, ఫుడ్స్, పర్సనల్ కేర్, హోమ్ కేర్ కేటగిరీలు ఈ ప్లాట్‌ఫామ్స్‌పై దూసుకుపోతున్నాయని డాబర్ సీఈఓ మోహిత్ మల్హోత్రా చెప్పారు. అలాగే ఈ భారీ డిమాండ్‌ను అందుకోవడానికి మారికో వంటి కంపెనీలు ఏఐ, ఆటోమేషన్ సాంకేతికతలను ఉపయోగించి తమ సప్లై చైన్‌ను మరింత బలోపేతం చేస్తున్నాయట.

# ఎన్ని చేసినా చర్మ సమస్యలు తగ్గకపోతే.. అందుకు అనేక కారణాలు ఉంటాయి..

చర్మం మసకబారడం, అలసటగా కనిపించడం లేదా అసమాన రంగుతో కనిపించడం ప్రారంభమైనప్పుడు చాలా మంది వెంటనే కొత్త స్కిన్‌కేర్ ఉత్పత్తులను ప్రయత్నించడం మొదలుపెడతారు. కొత్త సీరమ్ లేదా ఫేస్ మాస్క్ తాత్కాలికంగా కొంత మెరుగుదల ఇస్తుంది. కానీ నిరంతరంగా కనిపించే డల్ స్కిన్ సమస్యకు ఒక్క ఉత్పత్తి లోపమే కారణం కాదని నిపుణులు చెబుతున్నారు. క్లినికల్ స్కిన్ ప్రాక్టీస్‌లో చర్మం మసకబారడం అనేది శాస్త్రీయంగా రూపొందించిన సరైన చికిత్స, సరైన ఫార్ములేషన్స్, జీవనశైలి మార్పులు అవసరమనే సంకేతంగా ఎక్కువగా కనిపిస్తుందని అంటున్నారు. అన్ని రకాల చర్మాల్లోనూ డల్‌నెస్‌కు అనేక అంతర్గత, బాహ్య కారణాలు ఉంటాయి. మానసిక ఒత్తిడి, తగిన నిద్ర లేకపోవడం, ఎక్కువసేపు స్క్రీన్‌ల ముందు గడపడం, కాలుష్యం, డీహైడ్రేషన్, సెబమ్ అసమతుల్యత, మైక్రోబియోమ్ లోపాలు, మెలనిన్ అసమాన పంపిణీ, కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గడం వంటి అంశాలు చర్మ కాంతిని ప్రభావితం చేస్తాయి. దీర్ఘకాలంలో ఇవి చర్మపు రక్షణ పొరను బలహీనపరచి సహజ కాంతిని తగ్గిస్తాయి. అందుకే ఎన్నాళ్లుగానో వాడుతున్న స్కిన్‌కేర్ రొటీన్ కూడా ఒక దశ తర్వాత ఫలితం ఇవ్వదు.



**నీరు తగినంత లేకపోవడం..**

డల్ స్కిన్‌ను తగ్గించడంలో మొదటి, అత్యంత ముఖ్యమైన దశ దానికి కారణమేమిటో తెలుసుకోవడం. కొందరిలో నీటి లోపం, తగిన మాయిశ్చర్ లేకపోవడం ప్రధాన కారణం అవుతాయి. మరికొందరిలో సన్ డ్యామేజ్, ఆక్సిడేటివ్ స్ట్రెస్, పిగ్మెంటేషన్ సమస్యలు లేదా అసమతుల జీవనశైలి కారణమవుతాయి. శారీరక వ్యాయామం లేకపోవడం, అధిక ఒత్తిడి వల్ల ఎండోర్ఫిన్ స్థాయిలు తగ్గిపోవడం కూడా చర్మ కాంతిపై ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు. సరైన స్కిన్ అసెస్‌మెంట్ ద్వారా అసలు సమస్యను గుర్తిస్తే, చికిత్స కూడా మరింత టార్గెటెడ్‌గా, ఫలితాలిచ్చే విధంగా ఉంటుంది. చర్మంపై పేరుకుపోయే మృతకణాలు, అదనపు ఆయిల్, కాలుష్యపు కణాలను తొలగించకపోతే చర్మం మరింత డల్‌గా కనిపిస్తుంది. ప్రొఫెషనల్ డీప్ క్లెన్సింగ్, ఎక్స్‌ఫోలియేషన్ ఫేషియల్స్ చర్మ పునరుత్పత్తిని వేగవంతం చేస్తాయి. అలాగే చర్మానికి ఆక్సిజన్, పోషకాలు సరిగా అందేలా చేసి ఫ్రెష్ లుక్‌ను తీసుకువస్తాయి.

**చర్మ రక్షణ పొర బలహీనపడితే..**

తగినంత తేమ లేకపోవడం డల్ స్కిన్‌కు ప్రధాన కారణాల్లో ఒకటి. డీహైడ్రేటెడ్ చర్మం రఫ్‌గా, అలసటగా కనిపిస్తుంది. ఆక్సిజన్ ఫేషియల్స్, మాయిశ్చర్ రీప్లెనిషింగ్ ట్రీట్‌మెంట్స్ వంటి హైడ్రేషన్ ఆధారిత థెరపీలు చర్మంలోని లోతైన పొరల్లో నీటి సమతుల్యతను పునరుద్ధరిస్తాయి. సరైన నీటి సేవనం, సమతుల ఆహారం, ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ కూడా చర్మ కాంతిని మెరుగుపరుస్తాయి. చర్మ రక్షణ పొర బలహీనపడితే నీటి నష్టం పెరుగుతుంది. అదే సమయంలో కాలుష్యం, ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఇన్‌ఫ్లమేషన్ ప్రభావం కూడా ఎక్కువవుతుంది. అలాంటి పరిస్థితుల్లో ఎక్కువ యాక్టివ్ కెమికల్స్ వాడడం కంటే స్కిన్ బ్యారియర్ రిపేర్‌పై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. జెంటిల్ స్కిన్‌కేర్, సూతింగ్ థెరపీలు, మైక్రోబియోమ్ సపోర్టివ్ ఫార్ములేషన్స్, బ్యారియర్ రిపేర్ ఫేషియల్స్ చర్మాన్ని మళ్లీ ఆరోగ్యంగా మారుస్తాయి. టానింగ్, పిగ్మెంటేషన్, సన్ డ్యామేజ్ కారణంగా కూడా చర్మం మసకబారుతుంది. కంట్రోల్డ్ ఎక్స్‌ఫోలియేషన్, స్కిన్ రీజువెనేషన్ ప్రొసీజర్స్ చర్మ టెక్స్చర్‌ను మెరుగుపరుస్తాయి. వెంటనే రంగు మార్పు కోసం కాకుండా, చర్మ నాణ్యతను క్రమంగా మెరుగుపరచడమే ఈ చికిత్సల అసలు లక్ష్యం.

**జీవనశైలి ముఖ్యం..**

ఎంత ఖరీదైన స్కిన్‌కేర్ చేసినా సరైన జీవనశైలి లేకపోతే దీర్ఘకాల ఫలితాలు రావు. మంచి నిద్ర, సమతుల ఆహారం, ఒత్తిడి నియంత్రణ, క్రమమైన వ్యాయామం, తగినంత నీటి సేవనం వంటి అంశాలు చర్మ ఆరోగ్యంపై నేరుగా ప్రభావం చూపుతాయి. కొల్లాజెన్ ఉత్పత్తి, హార్మోన్ బ్యాలెన్స్, ఇన్‌ఫ్లమేషన్ నియంత్రణకు ఇవి కీలకం. తి వ్యక్తి చర్మ నిర్మాణం భిన్నంగా ఉంటుంది. కొందరికి హైడ్రేషన్, బ్యారియర్ రిపేర్ అవసరమైతే, మరికొందరికి పిగ్మెంటేషన్ కరెక్షన్, యాంటీ ఆక్సిడెంట్ సపోర్ట్ లేదా రీజువెనేషన్ థెరపీలు అవసరం అవుతాయి. సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న రొటీన్‌లను అనుసరించడం కంటే, వ్యక్తిగత చర్మ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన స్టెప్ బై స్టెప్ స్కిన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ దీర్ఘకాలంలో మెరుగైన ఫలితాలను ఇస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

## దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ బియ్యం వెరైటీలు ఇవే..

భారతీయుల ఆహార సంస్కృతిలో బియ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. బియ్యంతో వండిన అన్నాన్ని చాలా మంది ఆహారంగా తీసుకుంటూ ఉంటారు. అయితే ప్రస్తుతం ఎక్కువమంది బాస్మతి లేదా పాలిష్ చేసిన తెల్ల బియ్యాన్నే ప్రధానంగా ఉపయోగిస్తున్నారు. కానీ శతాబ్దాల క్రితమే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేల సంఖ్యలో స్వదేశీ బియ్యం రకాలు సాగు చేయబడేవి. వీటిలో కొన్ని సహజ సువాసనతో, మరికొన్ని ఎరుపు లేదా నలుపు రంగులతో ప్రత్యేకతను సంపాదించాయి. రుచులు, వాసనలు, పోషక విలువలు ఒక్కో రకానికి ఒక్కో విధంగా ఉండటం వీటి ప్రత్యేకత. వివిధ రాష్ట్రాల్లో పండే స్వదేశీ బియ్యం రకాల గురించి నిపుణులు వివరిస్తున్నారు. అస్సాంలో ప్రసిద్ధి చెందిన జోహా బియ్యం చిన్నగా, గుండ్రంగా ఉండే గింజలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇది ఉడుకుతున్నప్పుడు ఇళ్లంతా తీయని పూల వాసనలా పరిమళిస్తుంది. వండిన తర్వాత మెత్తగా ఉండే ఈ బియ్యం అతుక్కుపోకుండా ఉంటుంది. పులావ్, పండుగల భోజనాలు, ఖీర్ వంటి తీపి వంటకాల్లో దీనిని విరివిగా ఉపయోగిస్తారు. అస్సాంలో శతాబ్దాలుగా సాగు చేస్తున్న ఈ బియ్యానికి జీఐ ట్యాగ్ కూడా లభించింది.



**పశ్చిమ బెంగాల్, మణిపూర్..**

పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోబిందోభోగ్ బియ్యం అక్కడి సంప్రదాయాలతో ముడిపడి ఉంది. చిన్న తెల్లని గింజలతో ఉండే ఈ బియ్యం వెన్నలాంటి మృదువైన వాసనను ఇస్తుంది. ఖిచిడి, పాయేష్, పులావ్ వంటి బెంగాలీ వంటకాల్లో దీన్ని ప్రధానంగా ఉపయోగిస్తారు. ముఖ్యంగా దుర్గాపూజ సమయంలో ఈ బియ్యం లేకుండా సంప్రదాయ వంటలు పూర్తి కావని భావిస్తారు. 2017లో ఈ బియ్యానికి జీఐ గుర్తింపు లభించింది. అలాగే మణిపూర్‌కు చెందిన చక్-హావో అనే నల్ల బియ్యం దేశంలో అత్యంత ప్రత్యేకమైన రకాలలో ఒకటి. వండకముందు నల్లగా కనిపించే గింజలు ఉడికిన తర్వాత గాఢ ఊదా రంగులోకి మారుతాయి. కొద్దిగా తీయని, నట్స్ రుచిని కలిగిన ఈ బియ్యం పురాతన కాలంలో రాజవంశీయులకే పరిమితమై ఉండేదని చెబుతారు. చక్-హావో ఖీర్ ఈ బియ్యంతో చేసే ప్రసిద్ధ వంటకం. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటంతో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టేవారు కూడా దీనిని ఇష్టపడుతున్నారు.

**తమిళనాడు, ఉత్తర ప్రదేశ్..**

తమిళనాడులో ప్రసిద్ధి చెందిన మప్పిళ్లై సంబా ఎర్ర బియ్యం వెనుక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. వరుడి బియ్యం అని అర్థమయ్యే ఈ రకం శక్తి, స్టామినా పెంచుతుందని నమ్మకం. గట్టిగా ఉండే ఈ బియ్యాన్ని దోశలు, ఇడ్లీలు, గంజి వంటి సంప్రదాయ వంటల్లో ఉపయోగిస్తారు. ఒకప్పుడు కనుమరుగవుతున్న ఈ రకం ఇప్పుడు ఆరోగ్యకరమైన ధాన్యాలపై పెరుగుతున్న ఆసక్తితో మళ్లీ ప్రాచుర్యం పొందుతోంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాలానమక్ బియ్యానికి బౌద్ధకాలం నాటి చరిత్ర ఉందని చెబుతారు. దీని పేరుకు కారణం గింజలపై ఉండే నలుపు రంగు పొట్టు. ఉడికినప్పుడు పాప్‌కార్న్ వాసనలా ప్రత్యేకమైన పరిమళం వస్తుంది. కొద్దిగా తీపి రుచితో ఉండే ఈ బియ్యం పులావ్ వంటి వంటకాలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. సాగు తగ్గిపోవడంతో అంతరించిపోతున్న ఈ రకానికి ప్రభుత్వం జీఐ ట్యాగ్ ఇచ్చి ప్రోత్సాహం కల్పించింది.

**కేరళ, మహారాష్ట్ర..**

కేరళలోని నజావర బియ్యం ఆయుర్వేదంలో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఎర్రని గింజలతో ఉండే ఈ బియ్యం సాధారణ బియ్యంతో పోలిస్తే కొద్దిగా చేదు, మట్టి వాసన కలిగిన రుచిని ఇస్తుంది. ఆరోగ్య ప్రయోజనాల కోసం దీన్ని ఆయుర్వేద గంజి, ప్రత్యేక ఆహారాల్లో ఉపయోగిస్తారు. మధుమేహం, ఎముకల బలహీనత వంటి సమస్యల్లో ఇది ఉపయోగకరమని భావిస్తారు. మహారాష్ట్రకు చెందిన అంబెమోహర్ బియ్యం మామిడి పూల పరిమళాన్ని సూచిస్తుంది. వండినప్పుడు వచ్చే సువాసన మామిడి పూల వాసనను తలపిస్తుంది. మసాలే భాత్ వంటి మహారాష్ట్ర సంప్రదాయ వంటల్లో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. జీఐ ట్యాగ్ పొందిన ఈ బియ్యం అక్కడి ప్రజలకు ఎంతో ప్రీతిపాత్రమైనది. తమిళనాడులో ప్రసిద్ధి చెందిన కావుని బియ్యం కూడా ఒకప్పుడు రాజ కుటుంబాలకు మాత్రమే పరిమితమై ఉండేదని చెబుతారు. నల్లని రంగు, తీయని నట్స్ రుచి, నమిలే గుణం దీనికి ప్రత్యేకత. బెల్లం, కొబ్బరితో చేసే కావుని అరిసి స్వీట్ అనే తీపి వంటకం ఎంతో ప్రసిద్ధి చెందింది. సాధారణ బియ్యంలా తేలికగా కాకుండా గట్టిగా ఉండే ఈ బియ్యం ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. దేశంలోని ఈ స్వదేశీ బియ్యం రకాలు కేవలం ఆహారం మాత్రమే కాదు, ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆరోగ్య జ్ఞానానికి కూడా ప్రతీకలుగా నిలుస్తున్నాయి.

## చర్మం, గోర్ల సమస్యలకు అనేక కారణాలు ఉంటాయి.. అందరూ అవగాహన కలిగి ఉండాల్సిందే..

చర్మం పొడిబారడం, గోర్లు త్వరగా విరిగిపోవడం వంటి సమస్యలను చాలా మంది సాధారణ సౌందర్య సమస్యలుగా తీసుకుంటారు. చలి వాతావరణం, ఎక్కువసార్లు చేతులు కడగడం, వయస్సు పెరగడం లేదా నీరు తక్కువగా తాగడం వల్ల ఇలా జరుగుతుందని భావిస్తారు. అయితే కొన్ని సందర్భాల్లో ఇవి శరీరంలో జరుగుతున్న హార్మోన్ల మార్పులకు సంకేతాలు అయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. చర్మం తేమ, చర్మంలోని ఆయిల్ ఉత్పత్తి, రక్తప్రసరణ, గోర్ల బలం వంటి అనేక అంశాలను హార్మోన్లు నియంత్రిస్తాయి. అందువల్ల హార్మోన్ల అసమతుల్యత వచ్చినప్పుడు దాని ప్రభావం బయటకు కూడా కనిపిస్తుంది.

**థైరాయిడ్ గ్రంథి ప్రభావం..**

థైరాయిడ్ గ్రంథి పనితీరు తగ్గిపోవడం వల్ల వచ్చే హైపోథైరాయిడిజం ఈ సమస్యలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా భావిస్తున్నారు. థైరాయిడ్ హార్మోన్లు తగ్గిపోతే శరీరంలోని సహజ ప్రక్రియలు మందగిస్తాయి. దీని ప్రభావంగా చర్మం పొడిగా, గరుకుగా, పొలుసులా మారుతుంది. గోర్లు పలుచగా మారి సులభంగా విరిగిపోతాయి. అలసట, అకస్మాత్తుగా బరువు పెరగడం, మలబద్ధకం, జుట్టు రాలడం, ముఖం ఉబ్బినట్టుగా కనిపించడం, చలికి ఎక్కువగా ఇబ్బంది పడటం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఇవి నెమ్మదిగా అభివృద్ధి చెందడం వల్ల చాలామంది మొదట్లో గుర్తించలేకపోతారు. గర్భధారణ సమయంలో లేదా మెనోపాజ్ దశలో కూడా హార్మోన్ల మార్పులు చర్మం, గోర్లపై ప్రభావం చూపిస్తుంది. ఈ సమయంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరోన్ స్థాయిల్లో మార్పుల వల్ల చర్మ తేమ తగ్గడం, గోర్లు బలహీనపడడం జరుగుతుంది. అయితే చాలా సందర్భాల్లో హార్మోన్లు మళ్లీ సమతుల్యంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యలు తగ్గిపోతాయి.



**పోషకాహార లోపాలు..**

హార్మోన్ల సమస్యలతోపాటు పోషకాహార లోపాలు కూడా చర్మం, గోర్ల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. శరీరంలో ఐరన్, విటమిన్ బి12, జింక్ లేదా ప్రోటీన్ లోపం ఉంటే గోర్లు బలహీనపడటం, చర్మం నిర్జీవంగా మారటం జరుగుతాయి. ముఖ్యంగా పరిమిత ఆహారం తీసుకునే వారు లేదా సరైన ఆహారపు అలవాట్లు లేని వారిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. జీవనశైలి, పర్యావరణ పరిస్థితులు కూడా ప్రభావం చూపుతాయి. గట్టిగా ఉండే సబ్బులు, శానిటైజర్లు, డిటర్జెంట్లు ఎక్కువగా వాడటం, ఎక్కువసేపు నీటిలో పని చేయడం, డీహైడ్రేషన్, ఎగ్జిమా, సోరియాసిస్ వంటి చర్మవ్యాధులు చర్మ రక్షణ పొరను దెబ్బతీసి గోర్లను బలహీనపరుస్తాయి. ఎయిర్ కండిషనర్లు, వేడి నీటితో స్నానం, పొడి వాతావరణం సమస్యను మరింత పెంచుతాయి. చర్మం పొడిబారడం, గోర్లు విరిగిపోవడం వంటి లక్షణాలు ఎక్కువకాలం కొనసాగితే లేదా జుట్టు రాలడం, అలసట, నెలసరి సమస్యలు, బరువు మార్పులు, మూడ్ స్వింగ్స్ వంటి ఇతర లక్షణాలు కూడా కనిపిస్తే వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. థైరాయిడ్ పరీక్షలు, ఐరన్ స్థాయిలు, విటమిన్ పరీక్షలు, హార్మోన్ టెస్టులు చేయించుకోవడం ద్వారా అసలు కారణాన్ని ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది.

**రోజువారీ జాగ్రత్తలు..**

రోజువారీ జాగ్రత్తలు కూడా చర్మం, గోర్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. సెరమైడ్ ఆధారిత మాయిశ్చరైజర్లు వాడటం, తగినంత నీరు తాగటం, ప్రోటీన్ ఎక్కువగా ఉండే సమతుల ఆహారం తీసుకోవడం, చేతులను రసాయనాల నుంచి రక్షించుకోవడం, గోర్లకు అధిక ఒత్తిడి రాకుండా చూసుకోవడం వంటి అలవాట్లు ప్రయోజనకరంగా ఉంటాయి. ఆరోగ్యవంతమైన చర్మం, బలమైన గోర్లు కేవలం అందానికి సంబంధించినవి మాత్రమే కాకుండా శరీరంలోని అంతర్గత ఆరోగ్య పరిస్థితులను ప్రతిబింబించే సూచికలుగా కూడా భావించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# ధోనీ భవిష్యత్తుపై సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ కీలక ప్రకటన!

సీఎస్కేను ఐదు సార్లు ఛాంపియన్ గా నిలిపిన ధోనీ

జట్టులో ధోనీ ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు అభ్యంతరం లేదన్న సీఈవో

ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుందని స్పష్టీకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ అనగానే అందరికీ గుర్తొచ్చే పేరు మహేంద్ర సింగ్ ధోనీ. సీఎస్కే అంటే ధోనీ, ధోనీ అంటే సీఎస్కే అనేంతలా ఆ జట్టుతో అతడి బంధం ముడిపడిపోయింది. అయితే, మోకాలి గాయం కారణంగా ధోనీ ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడలేకపోయాడు. దీంతో అతడి ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు క్రికెట్ వర్గాల్లో జోరందుకున్నాయి. ఈ ఊహాగానాలపై సీఎస్కే జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ ఒక సంచలన ప్రకటన చేశారు. ధోనీ జట్టులో ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఆ నిర్ణయం పూర్తిగా అతడి వ్యక్తిగత ఇష్టానికే వదిలేస్తున్నామని స్పష్టం చేశారు. “ధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మాకు ఆనందమే. అతడు ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా అతడి ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది” అని సీఈవో వెల్లడించారు. ధోనీ ఇంకా తన రిటైర్మెంట్‌పై అధికారిక ప్రకటన చేయనప్పటికీ, వచ్చే సీజన్ నాటికి అతడు సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో లేదా సపోర్ట్ స్టాఫ్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే వార్తలకు ఈ వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. ముఖ్యంగా, సీఎస్కే హెడ్ కోచ్ పదవికి ధోనీని మించిన అర్హుడు మరెవరూ లేరని మాజీలు కూడా అభిప్రాయపడుతున్నారు.

# నేడు ఎలిమినేటర్‌లో రాజస్థాన్‌తో సన్‌రైజర్స్ ఢీ... ఎవరు బెటర్...? కుంబ్లే ఆసక్తికర విశ్లేషణ

- ఎలిమినేటర్‌లో రాజస్థాన్‌పై సన్‌రైజర్స్‌కు స్పష్టమైన ఆధిక్యం ఉంటుందన్న కుంబ్లే
- కొద్దిమంది ఆటగాళ్లపైనే రాజస్థాన్ ఆధారపడిందని విశ్లేషణ
- లీగ్ దశలో రాజస్థాన్‌తో మ్యాచే సన్‌రైజర్స్ కు టర్నింగ్ పాయింట్ అని వెల్లడి
- హర్షల్ పటేల్ స్థానంలో యువ పేసర్ హింగే ఆడే అవకాశం ఉందని అంచనా



**హైదరాబాద్ పెన్ పవర్:** నేడు జరగనున్న ఐపీఎల్ ఎలిమినేటర్ పోరులో రాజస్థాన్ రాయల్స్‌తో పోలిస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కే స్పష్టమైన ఆధిక్యం ఉందని భారత స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. జట్టులో లోతు, మ్యాచ్‌లను గెలిపించగల ఆటగాళ్లు ఎక్కువగా ఉండటమే హైదరాబాద్‌కు కలిసొచ్చే అంశమని విశ్లేషించాడు. జియో హాట్‌స్టార్‌తో మాట్లాడుతూ కుంబ్లే ఈ వ్యాఖ్యలు చేశాడు. “రెండు జట్లను పోల్చి చూస్తే, సన్‌రైజర్స్‌లో మ్యాచ్ విన్నర్లు ఎక్కువగా ఉన్నారు. మరోవైపు రాజస్థాన్ జట్టు యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, జోఫ్రా ఆర్చర్ వంటి కొద్ది మంది ఆటగాళ్లపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. ఈ కీలక ఆటగాళ్లు విఫలమైతే, ఆ జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండూ బలహీనపడతాయి. నాకౌట్ మ్యాచ్‌లో ఇదే ఫలితాన్ని నిర్దేశించవచ్చు” అని వివరించాడు. ఈ సీజన్ లీగ్ దశలో రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఒక టర్నింగ్ పాయింట్ అని కుంబ్లే గుర్తుచేశాడు. ఆ మ్యాచ్‌లోనే అరంగేట్రం చేసిన యువ పేసర్లు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ అద్భుత ప్రదర్శన చేశారని అన్నాడు. “ఆ మ్యాచ్‌కు ముందు హైదరాబాద్ జట్టు కూర్పు భిన్నంగా ఉండేది. యువ బౌలర్ల రాకతో వారు విజయాల ఫార్ములాను కనుగొన్నారు” అని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో, ఎలిమినేటర్‌లో హర్షల్ పటేల్ స్థానంలో ప్రఫుల్ హింగేను మళ్లీ తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉందని కుంబ్లే అంచనా వేశారు. గత మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీని హింగే ఔట్ చేసినందున, మానసికంగా ఇది అతనికి కలిసొస్తుందని తెలిపారు. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ప్లేఆఫ్స్‌లో ముందుకు సాగనుండగా, ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

# ఐపీఎల్ లవర్స్‌కు షాకింగ్ న్యూస్.. వేసవి క్రికెట్ పండగ ఇక ఉండదా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** సమ్మర్ అనగానే క్రికెట్ ప్రియులకు మొదటగా గుర్తుకు వచ్చేది ఐపీఎల్. సమ్మర్?లో రెండు నెలల పాటు ఐపీఎల్?ను తెగా ఎంజాయ్ చేస్తారు క్రికెట్ అభిమానులు. అయితే, ఎండకాలంలో క్రికెట్ లవర్స్?ను ఉర్రూతలూగించే ఐపీఎల్ విండోను బీసీసీఐ మార్చబోతుందా..? ఇకపై వేసవి క్రికెట్ పండగ ఉండదా..? అంటే కొన్ని వర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది.

టోర్నీ షెడ్యూల్ మార్పుపై ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ స్పోర్ట్స్ న్యూస్ ఛానల్ స్పోర్ట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ధుమాల్ మాట్లాడుతూ.. వేసవిలో అధిక వేడి, ఆటగాళ్ల అలసటపై ఆందోళనల కారణంగా ఐపీఎల్ టోర్నీ విండోను మార్చి-మే నుంచి సెప్టెంబర్-అక్టోబర్‌కు మార్చడాన్ని బీసీసీఐ పరిశీలించవచ్చని అన్నారు.

అయితే, ప్రస్తుత విండోను మార్చడానికి తక్షణ అవసరం ఏమీ లేదని.. విండో మార్పు నిర్ణయాన్ని లీగ్ ప్రసార భాగస్వామితో సంప్రదించి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇంకా దీనిపై తుది నిర్ణయం తీసుకోలేదని.. వాణిజ్య, నిర్వహణాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని టోర్నమెంట్ సమయాన్ని పునఃపరిశీలించే అవకాశం ఉందన్నారు.

ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి సాంప్రదాయకంగా ఏప్రిల్, మే రెండు నెలల వ్యవధిలో జరుగుతూ వస్తోంది. అయితే, 2028 నుంచి మ్యాచ్‌ల సంఖ్యను పెంచే అవకాశాన్ని కూడా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ పరిశీలిస్తుండటంతో, షెడ్యూలింగ్‌పై మళ్లీ చర్చ మొదలైంది. ప్రస్తుతం.. ఐపీఎల్‌లో రెండు నెలల వ్యవధిలో 10 జట్ల మధ్య 74 మ్యాచ్‌లు జరుగుతాయి.



ఆకర్షణీయవెైన క్లోజ్-అప్ గ్లామ్‌తో మెరిసే టీల్ లుక్‌లో శ్రీముఖి అబ్బురపరుస్తుంది

# సింగం 4: అక్కడ దేవగన్ - ఇక్కడ సూర్య భారీ ప్లాన్స్!



బాలీవుడ్ లో అత్యంత విజయవంతమైన యాక్షన్ ఫ్రాంచైజీలలో ఒకటైన -సింగం- సిరీస్ నుండి తదుపరి భాగం -సింగం 4- రూపొందుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ లో భాగంగా గత ఏడాది దీపావళికి విడుదలైన -సింగం అగైన్- చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు 390 కోట్ల వసూళ్లతో ఒక మోస్తరు విజయాన్ని అందుకుంది. అయితే ఆ చిత్రానికి వచ్చిన మిశ్రమ స్పందనను దృష్టిలో ఉంచుకుని దర్శకుడు రోహిత్ శెట్టి- యాక్షన్ స్టార్ అజయ్ దేవగన్ ఈ నాలుగో భాగాన్ని మరింత పకడ్బందీగా పాత -సింగం- తరహా బ్రాండ్ మాస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి స్క్రిప్ట్ పనులను వేగవంతం చేశారు.

గత చిత్రం -సింగం అగైన్- లో మల్టీస్టారర్ కాన్సెప్ట్..ఎక్కువ మంది హీరోల క్రాస్‌ఓవర్ల కారణంగా బాజీరావ్ సింగం - ఒరిజినల్ అగ్రెసివ్ క్యారెక్టరైజేషన్ కొంత తగ్గిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకున్న అజయ్ దేవగన్ ఈసారి -సింగం 4- లో ప్రేక్షకులు కోరుకునే ప్యూర్ మాస్ యాక్షన్, పవర్‌ఫుల్ డైలాగ్స్ .. ఒళ్లు గగుర్పొడిచే ఒరిజినల్ సింగం మార్కు ఇంటెన్సిటీని మళ్లీ పునరావృతం చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి సోలో హీరో ఎలిమెంట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత లభించే అవకాశం ఉంది.

మరోవైపు సౌత్ సినీ ఇండస్ట్రీలోనూ ఇదే టైటిల్‌తో మరో క్రేజీ ప్రాజెక్ట్ సిద్ధమవుతుండటం విశేషం. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో డైరెక్టర్ హరి తెరకెక్కించిన సూపర్ హిట్ తమిళ -సింగం- ఫ్రాంచైజీకి కూడా నాలుగో భాగం -సింగం 4- కోసం కథాచర్చలు జరుగుతున్నట్లు దర్శకుడు హరి అధికారికంగా ధృవీకరించారు. గతంలో ప్రాంతీయ, అంతర్జాతీయ నేరగాళ్లను వేటాడిన దురైసింగం పాత్రను ఈసారి మరింత వైవిధ్యమైన కథనంతో.. సరికొత్త విలన్లతో పాన్-ఇండియా రేంజ్‌లో భారీ స్థాయిలో ఆవిష్కరించేందుకు సూర్య, హరిల కాంబో సన్నాహాలు చేస్తోంది.

అక్కడ బాలీవుడ్ లో సింగం ఫ్రాంఛైజీలో కొత్త సినిమా దేవగన్ తో తెరకెక్కిస్తే.. అదే సమయంలో సూర్య హీరోగా హరి కూడా బరిలో దిగుతున్నారు గనుక ఈ ఫ్రాంఛైజీ మరోసారి నిరంతరం వార్తల్లో నిలవడం ఖాయం. దానికి తగ్గట్టే ఫ్యాన్స్ లోను అంతే క్రేజ్ నెలకొంటుంది. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి కాస్టింగ్, అఫీషియల్ అనౌన్స్‌మెంట్.. షూటింగ్ షెడ్యూల్ వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.



సన్యా మల్హోత్రా అద్భుతమైన బ్లాక్ స్టూడియో ఫోటోషూట్‌లో రా గ్లామర్‌ను ప్రదర్శించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965